

ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	40.3	38.0	43.0	43.0	38.0
కనిష్ఠం	28.2	28.0	28.0	28.0	28.0

సోమశిలలో 8.472 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి ప్రాజెక్టులో 8.472 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 15, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

'కేజీఎఫ్-1, కేజీఎఫ్-2ను చూశాను. ఎందుకంటే కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కుప్పం నియోజకవర్గం పక్కనే ఉంటాయి. కానీ కేజీఎఫ్-3 (కాకాణి గోవర్ధన్ ఫీల్డ్స్) చూడాలంటే సర్వేపల్లికి రావాలి. క్వార్ట్జ్, ఇసుక, గ్రావెల్, సిలికా అక్రమంగా తరలించి రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఒక్క క్వార్ట్జ్ లోనే రూ.4వేల కోట్లు దోచుకున్నారు. ఈ కోట్లు వింటుంటే కళ్లు తిరుగుతున్నాయి. రాష్ట్రాన్ని ఇప్పటి వరకు ఐదుగురు వ్యక్తులు జగన్‌రెడ్డి, విజయసాయి రెడ్డి, సజ్జల, పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి దోచుకుంటే ఇప్పుడు ఆరో వ్యక్తి కాకాణి వారికి తోడయ్యారు. ఈ అవినీతి సొమ్ముతో కాకాణి ఓటుకు రూ.10 వేలు ఇస్తారు. పూటుగా మద్యం తాగిస్తారు.. బెదిరిస్తారు.. లొంగదీసుకుంటారు.. పొరపాటున మళ్లీ లొంగితే జీవితం చీకటిమయం అవుతుంది. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే మీ ఆస్తులు లాక్కుంటారు. అందరూ వైసీపీ అరాచకాలను ధైర్యంగా ఎదుర్కోండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి'

- తెలుగుదేశం పార్టీ అధినేత
నారా చంద్రబాబు నాయుడు

గర్జించిన సర్వేపల్లి

ప్రజాగళం సభ సూపర్ సక్సెస్ ● జనవాహినితో కిక్కిరిసిన పొదలకూరు

పొదలకూరు (ఆంధ్రజ్యోతి) : ఎటు చూసినా జనం.. కిక్కిరిసిపోయిన రోడ్లు.. అరుపులు, కేకలు, నినాదాలతో హోరెత్తించిన కార్యకర్తలు.. పొదలకూరులోని గేట్ సెంటర్‌లో శనివారం కనిపించిన దృశ్యాలివి. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన ప్రజాగళం ఎన్నికల ప్రచార సభ సూపర్ సక్సెస్ అయ్యింది. మంత్రి కాకాణి సొంత మండలం కావడంతో పరిస్థితి ఎలా ఉంటుందా!? అని అందరూ ఆసక్తిగా ఎదురుచూడగా సాయంత్రం నాలుగు గంటలకు సభ ప్రారంభమయ్యే నాటికి భారీ జనసందోహంతో రోడ్లన్నీ నిండిపోయాయి. అటు చంద్రబాబు, ఇటు సోమిరెడ్డి ప్రసంగాల సమయంలో కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించారు. 'నలభై ఏళ్లుగా సర్వేపల్లి ప్రజల కోసమే జీవిస్తున్నా.. ఈసారి నన్ను తలెత్తుకునేలా చేయండి' అంటూ సోమిరెడ్డి భావోద్వేగంతో ప్రసంగించగా సభకు వచ్చిన వారంతా 'మేమున్నాం.. మేమున్నాం' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడం విశేషం. ప్రజలు, కార్యకర్తల ఉత్సాహాన్ని చూసిన చంద్రబాబు ఎప్పటిలాగా కాకుండా రెట్టించిన ఉత్సాహంతో ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలు, కార్యకర్తల చేతనే చెప్పించడంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. చంద్రబాబు ప్రసంగానికి సభకు వచ్చిన వారు చేతులతో సంకేతాలిస్తూ, ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతూ తమ మద్దతు తెలియజేశారు. 'కోర్టు దొంగ కాకాణి.. ఈ విషయం మరిచిపోయారు..' అంటూ సభకు వచ్చిన వారు పెద్ద ఎత్తున అరుస్తూ చంద్రబాబుకు గుర్తు చేయడంతో ఆయన ఆ విషయంపై మాట్లాడారు. కోర్టు దొంగను వదిలే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. సన్న బియ్యం ఇస్తానన్న సన్నాసి జగన్ కాదా.. అని చంద్రబాబు ప్రశ్నించగా ఆ సన్నాసి ఇవ్వలేదంటూ కింది నుంచి పెద్ద ఎత్తున సమాధానాలు వచ్చాయి. కరెంటు బిల్లులు ఎన్నిసార్లు పెరిగాయంటూ చంద్రబాబు ప్రశ్నించగా ఎనిమిది సార్లు అంటూ ప్రజలే గట్టిగా అరుస్తూ చెప్పడం నాయకులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎవరిదంటూ చంద్రబాబు ప్రశ్నించగా.. మాదే, మాదే అంటూ ప్రజలు గట్టిగా సమాధానమిచ్చారు. తన సర్వేలో సోమిరెడ్డి గ్రాఫ్ పెరిగిందని, సర్వేపల్లిలో తెలుగుదేశానికి బ్రహ్మాండంగా ఉందని చంద్రబాబు చెప్పడంతో సభకు వచ్చిన వారంతా గట్టిగా చప్పట్లు కొట్టి కేరింతలు వేశారు.





రాజగోపాల్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న చంద్రబాబు

తలెత్తుకునేలా చేయండి



నాలుగు సార్లు ఓడిపోయినా మన నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు మళ్లీ నాకు చంద్రబాబు టికెట్ ఇచ్చారు. ఈసారి ఎన్నికల్లో సగర్వంగా తలెత్తుకునేలా ఆశీర్వదించాలి. సర్వేపల్లిలో కాకాణి బెదిరింపులకు భయపడకుండా ప్రజలు కట్టలు తెంచుకుని వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నారు. ఇప్పటివరకు 3771 కుటుంబాలు, 12వేల మంది జనాభా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసారి ఎన్నికల్లో భారీ మెజారిటీతో నన్ను గెలిపిస్తే బతికినంతకాలం సర్వేపల్లికి, రాష్ట్రానికి సేవచేస్తా. నిద్రాహారాలు మాని రాష్ట్ర భవిష్యత్తు కోసం పేదలను ధనవంతులుగా చేయాలన్న లక్ష్యం కోసం పనిచేసే ఎన్డీఏ కూటమిని ఆదరించాలి.


- సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి

రాజకీయ తోడేలును తరిమేద్దాం



రాష్ట్రంలో జగన్ సీఎంగా ఉన్నంత కాలం ప్రజాస్వామ్యం ఉండదు. ఐఏఎస్ అధికారిగా నా 30ఏళ్ల సర్వీసులో ఇలాంటి నిరంకుశ అవినీతిపాలనను చూడలేదు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి సొంత ఆస్తులను పెంచుకుని రాజకీయాన్ని ఒక వ్యాపారంగా మార్చారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని ఆదరిస్తే డబుల్ ఇంజన్‌తో పని చేస్తాము. రాజకీయ తోడేలును రాష్ట్రం నుంచి తరిమేసి సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షించే ఉమ్మడి కూటమిని ఆదరించాలి.

- తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



మళ్లీ లొంగితే జీవితం చీకటే!



పొదలకూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : శనివారం సాయంత్రం మధ్యాహ్నం 4:00 గంటలకు పొదలకూరుకు చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ముఖ్య నేతలంతా పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం గేట్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. ముందుగా చంద్రబాబు జన్మదినం సందర్భంగా టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. టీడీపీ నేతలంతా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. సర్వేపల్లిలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం తన అదృష్టమని ఈ సందర్భంగా చంద్రబాబు పేర్కొన్నారు.

● సహజ వనరులే సమాధి కడతాయి

'క్వార్ట్జ్, ఇసుక, గ్రావెల్, సిలికా అవినీతిలో కాకాణి కూరుకుపోయారు. మళ్లీ పైకి వచ్చే అవకాశమే లేదు. కాకాణి దోచిన సహజ వనరులే ఆయనకు రాజకీయ సమాధి కడతాయి. ఒక అసమర్థ మంత్రి సర్వేపల్లి నుంచి ఉండడం ప్రజలు చేసుకున్న ఖర్మ. మంత్రి దోపిడీ మూలంగా కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలిపోయింది. దాని మూలంగా పది వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోరాడి పోరాడి బక్కచిక్కిపోతే కాకాణి దోచుకొని దోచుకొని పెరిగిపోయారు. కరోనా వంటి విపత్కర సమయంలో ప్రజల పేరుతో డబ్బులు వసూలు చేసి కరోనా ప్యాలెస్ కట్టుకున్న వ్యక్తి కాకాణి. ఆయన అవినీతిపై పోరాడిన సోమిరెడ్డిపై 22 కేసులు పెట్టారు. కార్యకర్తలు, ప్రజలపైనా కేసులు పెట్టారు. తెలుగుదేశం పార్టీ 22 సంవత్సరాలు అధికారంలోకి ఉంది. నేను 14 ఏళ్ల సీఎంగా ఉన్నాను. నేను కూడా ఇలా చేసి ఉంటే వైసీపీ నాయకులు ఇళ్లలో నుంచి బయటకు వచ్చే వాళ్లా!? ప్రజలు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదలను. చక్రవడ్డీతో సహా చెల్లిస్తా



చంద్రబాబుకు చిత్రపటం అందజేస్తున్న మేకపాటి చంద్రశేఖరరెడ్డి, శాంతమ్మ దంపతులు

● సర్వేపల్లి గ్రాఫ్ పెరుగుతోంది

నేను ఐవీఆర్ఎస్ సర్వే చేస్తే సర్వేపల్లిలో సోమిరెడ్డి ఒక్కరే ఢీకొంటారని కార్యకర్తలు చెప్పారు. మీ మీద నమ్మకంతో సోమిరెడ్డికి సీటు ఇచ్చి నా బాధ్యత నెరవేర్చుకున్నా. ఇక సోమిరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. చంద్రమోహన్‌రెడ్డి వద్ద డబ్బుల్లేవు. నాలుగుసార్లు ఓడిపోయినా ప్రజా సమస్యలపై పోరాడి మళ్లీ మీ ముందుకు వస్తున్నారు. ఐఏఎస్ అధికారిగా పని చేసిన వరప్రసాద్ తిరుపతి ఎంపీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేస్తున్నారు. వీరిద్దరినీ గెలిపించండి. సర్వేపల్లిలో గ్రాఫ్ పెరుగుతోంది. విజయంపై నాకు నమ్మకం ఏర్పడింది.

● అధికారంలోకి రాగానే..

టీడీపీ అధికారంలోకి రాగానే ముత్తుకూరులో క్రికెట్ మినీ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. పొదలకూరులో నిమ్మ రైతులను ఆదుకుంటాం. కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్ యూనిట్ అవసరమని నిమ్మ రైతులు అడిగారు.. అవి కూడా నిర్మిస్తాం. కృష్ణపట్నం పోర్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు రూ.15 లక్షల పరిహారం చెల్లిస్తాం. బండేపల్లి-డేగ పూడి కాలువను పూర్తి చేస్తాం. తెలుగుగంగ కాలువల పెండింగ్ పనులు పూర్తి చేసే బాధ్యత నేను తీసుకుంటా' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ సభలో టీడీపీ నాయకులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఆనం వెంకట్రమణారెడ్డి, సోమిరెడ్డి తనయుడు రాజగోపాల్‌రెడ్డి, కోడలు శ్రుతిరెడ్డి పాల్గొన్నారు.



ఇదిగో మద్యం డంప్!

ముత్తుకూరు, ఏప్రిల్ 20 : పంటపాలెం పంచాయతీలో మద్యం నిల్వ చేసిన స్థావరాలపై శనివారం ప్రత్యేక బృందం దాడులు చేసి సుమారు 4,232 మద్యం సీసాలు, మూడు కార్లను స్వాధీనం చేసుకుంది. వైసీపీ నాయకుడు సుధాకర్ రెడ్డితో పాటు ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకుంది. సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు పంటపాలెంకు చెందిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అను చరుడు మారు సుధాకర్ రెడ్డి ఇంటిపై సెబ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో కూడిన ప్రత్యేక బృందం దాడులు నిర్వహించింది. ఇదే సమయంలో తన సొంత వాహనాలలో గోతాలలో మద్యం సీసాలను నింపి బయటికి పంపించేశారు. దీంతో అప్రమత్తమైన అధికారులు వాహనాలను వెంబడించగా పంటపాలెం గ్రామానికి 2 కి.మీ దూరంలో ఉన్న ఆయిల్ డబ్బాల తయారీ కేంద్రం వద్ద పట్టుకున్నారు. అందులో ఉన్న ఏడు బస్తాల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పంటపాలెం గ్రామాన్ని ఎస్పీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు, ఎస్ఈబీ అధికారులు జల్లెడ పట్టారు. వాహనాల జాడలను గుర్తించి, నక్కల కాలువ సమీపంలో మారు శ్రీనివాసులురెడ్డి రొయ్యల చెరువుల వద్ద అక్రమంగా నిల్వ చేసిన 13 గోతాముల్లోని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాస్థాయి అధికారులు వచ్చే వివరాలు వెల్లడించలేమని ఎస్ఈబీ శ్రీనివాసులు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో తొలిసారిగా భారీస్థాయిలో మద్యం స్వాధీనం చేసుకోవడం గమనార్హం.



రొయ్యల చెరువు వద్ద స్వాధీనం చేసుకున్న మద్యం బస్తాలు



మద్యం సీసాల బస్తాలతో ఉన్న కారు

3వ రోజు.. 9 నామినేషన్లు

నెల్లూరు(హరనాథపురం) : ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో 3వ రోజు శనివారం జిల్లావ్యాప్తంగా 9 సెట్ల నామినేషన్లు దాఖలు అయ్యాయి. నెల్లూరు లోక్‌సభ స్థానానికి ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కందుకూరు కావలి, కోవూరు, నెల్లూరుసిటీ, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవవర్గాలకు 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కందుకూరులో జయభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పొడపాటి శివకుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా అక్కిలగుంట ఇషాక్‌లు తమ నామినేషన్ పత్రాలను ఆర్వో విద్యాధరికి అందచేశారు. నెల్లూరు సిటీ నుంచి సోషల్ డెమెక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా షేక్ అమీర్ అహ్మద్ నామినేషన్ పత్రాన్ని ఆర్వో వికాస్‌మర్మత్‌కు అందచేశారు. కాగా ఈ మూడు రోజుల్లో ఏడు సెగ్మెంట్లకు 23 మంది, ఎంపీ స్థానానికి ఇద్దరు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

రేపు కాకర్ల నామినేషన్

ఉదయగిరి రూరల్: నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్య క్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

నామినేషన్‌కు తరలిరండి: ఆనం

ఆత్మకూరు ఏప్రిల్ 20: ఈ నెల 22న ఆత్మకూరులో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ముందుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఆత్మకూరు ఉదయగిరి

చంద్రబాబు సీఎం అయితేనే జనరంజక పాలన

- ఘనంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 74వ జన్మదినం
- ఉదయగిరి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్ల
- అన్ని గ్రామాల్లోనూ కేక్ కట్ చేసిన ఉమ్మడి శ్రేణులు



చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వేమిరెడ్డి, కాకర్ల, మేకపాటి, తదితరులు

ఉదయగిరి, ఏప్రిల్ 20: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి అవ్వాలని, ఆ బాధ్యత మనందరిపై ఉందని నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లు పిలుపునిచ్చారు. శనివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు 74వ జన్మదిన వేడుకలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మేకపాటి శాంతకుమారి, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఉదయగిరిలోని వారి నివాస ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు ఇంటింటికెళ్లి ఓటర్లను కలిసి సైకిల్ గుర్తుపై ఓట్లేసి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును, ఎంపీగా వేమిరెడ్డిని, ఎమ్మెల్యేగా కాకర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పలూమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎండీ లియాఖత్‌అలీ, వరికుంట పాడు మండలం విరువూరు ఎంపీటీసీ కాలే లక్ష్మీదేవి, కాలే రమణయ్య, కాకి శ్రీనివాసులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చెంచలబాబు యాదవ్, మన్నేటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సీతారామపురం: సంబరాల్లో నాయకులు

ఆత్మకూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తాళ్లూరు గిరినాయుడు పాల్గొన్నారు. బర్త్‌డే కేక్‌ను కట్ చేసి నేతలకు, కార్యకర్తలకు పంచిపెట్టారు.

మర్రిపాడు: స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు 74కేజీల కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, మాజీ ఎంపీపీ కటారి రమణయ్య, పుట్టం శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరు: వేడుకల్లో పాల్గొన్న ఆనం రామనారాయణరెడ్డి

సీతారామపురం: స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కోర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభా కర్ రాజు, మండల క్లస్టర్ ఇంచార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యం లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచిపెట్టి మాట్లాడారు. చంద్రబాబు మరోసారి సీఎం స్థానంలో కూర్చుని జనరంజకపాలన కొన సాగించాలని ఆకాంక్షించారు.

కలువాయి: రాజుపాళెంలో బీజేపీ, జనసేన, నాయకులు ఇంటింటికి తిరిగి వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.



మర్రిపాడు: కేక్ కట్ చేస్తున్న యువత

అనంతసాగరం: స్థానిక పార్టీ కార్యాలయంలో నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఎంపీటీసీ మెట్టుకూరు బుజ్జమ్మ, మెట్టుకూరు కృష్ణారెడ్డి, చల్లా శివారెడ్డి, నర్సారెడ్డి, మెట్టుకూరు మనోజ్‌రెడ్డి చంద్రా రాజయ్య నాయు డు పాల్గొన్నారు.

సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ మండల కన్వీనర్ గుండ్లపల్లి శ్రీనివాసులుయాదవ్ శనివారం మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు.



సంగంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన అయ్యగారిపాలెం సర్పంచి దంపతులు

టీడీపీలోకి వైసీపీ కీలక నేతలు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. శనివారం పొదలకూరులో జరిగిన సభలో చంద్రబాబు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే ఈదూరు రామకృష్ణారెడ్డి సోదరుడు సీనియర్ నాయకుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి (బాబిరెడ్డి), ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైటెడ్ ఫోరం ప్రెసిడెంట్ డేగా రవిరాఘవేంద్ర, పొదలకూరు మండలం విరువూరు సర్పంచ్ డేగా జగన్‌మోహన్, అయ్యగారిపాలెం సర్పంచ్ కండే వసంతమ్మ, కండే నరస య్య, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనగట్ల రఘురామ్ ముదిరాజ్, వైసీపీ విద్యార్థి విభాగ రాష్ట్ర నేత సర్వేపల్లి విశ్వరూపాచారి, ముత్తుకూరు మం డలం కృష్ణపట్నం మాజీ ఎంపీటీసీ సభ్యుడు కారంచేటి ప్రసాద్‌శర్మ, బుడం గుంట రామకృష్ణారెడ్డి, ఇనుకుర్తి వైసీపీ నేత నోటి శ్రీనివాసులురెడ్డి, రావూరి శేషయ్య నాయుడు, బత్తల హరిందర్‌రెడ్డి, గోపిరెడ్డి మల్లికార్జున, తాళ్లపరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నెం రాముగౌడ్‌తో పాటు వారి అనుచరులున్నారు. మంత్రి కాకాణి సొంతూరు తోడేరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లోని అయ్యగారిపాలెం సర్పంచ్ కండే వసంతమ్మ, కండే నరసయ్యతో పాటు వైసీపీకి కోటగా చెప్పుకునే విరువూరు సర్పంచ్ కూడా టీడీపీలోకి రావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఏసీబీ వలలో తూ.కొ ఇన్‌స్పెక్టర్

- వెరిఫికేషన్ సర్టిఫికెట్‌కు లంచం తీసుకుంటుండగా పట్టివేత



లంచం తీసుకున్న అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 20: తూనికలు, కొలతల యంత్రాలకు వార్షిక ధ్రువ పత్రాలు జారీ చేయాలంటే లంచం డిమాండ్ చేశాడు ఆశాఖ ఇన్‌స్పెక్టర్. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధి తుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కాగా ఆ అధికారి శనివారం లంచం తీసుకుంటుండగా వారు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, నెల్లూరు నగరానికి చెందిన ఎం. వెంకటపతికి పలు ఏజెన్సీలు ఉన్నాయి. ప్రతీ ఏటా ఆయనకు సంబంధించిన తూనికలు, కొలతల యంత్రాలను తూ.కొ అధికారులు పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేస్తుంటారు. దాంతో పాటు ఆయన స్టాంప్ డ్యూటీ చెల్లిస్తుంటాడు. ఈ క్రమంలో వెంకటపతి తన యంత్రాలను పరిశీలించాలని, ధ్రువపత్రాలు జారీ చేయాలని తూ.కొ అధికారులను సంప్రదించారు. ధ్రువపత్రాలను జారీచేయాలంటే అధిక మొత్తంలో నగదును లంచంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో నెల్లూరు ఏసీబీ డీఎస్పీ శిరీషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ అంజనేయరెడ్డి, సిబ్బంది శనివారం తూనికలు కొలతల కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకర్ బాధితుడి నుంచి నగదు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి ఏసీబీ అధికారులు రూ.38,150 నగదును స్వాధీనం చేసుకుని, ఈ మేరకు కేసు నమోదు చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయా... లేదా ? అని అధికారులు, సిబ్బంది పాత్రపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

రెండు లారీల ఢీ : డ్రైవరు మృతి



ప్రమాదానికి గురైన లారీ

మర్రిపాడు, ఏప్రిల్ 20: నందవరం సమీపంలోని నెల్లూరు-ముం బాయి జాతీయ రహదారిపై శనివారం ఉదయం రెండు లారీలు ఎదురెదురు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బొగ్గు లారీ డ్రైవర్ ఓబుల్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కడప వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ, నెల్లూరు వైపు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న లారీ ఎదురెదురు ఢీ కొన్నాయి. కోళ్ల వ్యర్థాలతో వెళ్తున్న లారీ రోడ్డుకు అడ్డంగా పడిపోవటంతో వ్యర్థాలు రోడ్డుపై చల్లా చదురు పడిపోయాయి. దారిన వెళ్లే ప్రయాణికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

- దుర్వాసనతో గుర్తించిన రైల్వే అధికారులు

కావలి రూరల్, ఏప్రిల్ 20: కావలి పట్టణంలోని వడ్డిపాలెం సమీపంలో ఉన్న పాడుబడ్డ రైల్వే క్వార్టర్స్‌లో సుమారు 60 ఏళ్ల వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. శనివారం ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుండడంతో రైల్వే అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1వ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. పాడుబడిన రైల్వే క్వార్టర్స్ నుంచి దుర్వాసన రావటాన్ని పసిగట్టిన ఇంజనీరింగ్ డిపార్టు మెంట్‌కు చెందిన రొట్టె నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శిథిలావస్థలో ఉన్న భవనాల్లో పరిశీలించగా మృతదేహం ఉంది. అయితే మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు గోధుమ రంగు ప్యాంటు, లైట్ గ్రీన్ కలర్ పై పింకు, నలుపు గీతల పొడవు చేతుల చొక్కా ధరించి బట్టతలతో ఉన్నాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

314 మద్యం సీసాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20 : మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై పోలీసు, సెబ్ అధికారులు శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు దాడులు నిర్వహించి 314 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సైదాపురం పోలీసు స్టేషన్ పరిధిలో 20, కృష్ణాపట్నంలో 9, కొండాపురంలో 15, సంగంలో 11, దుత్తలూరులో 7, జలదంకిలో 25, చేజర్లలో 10, సెబ్ అధికారులు 217 మొత్తం అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను సీజ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి తీవ్ర గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 20 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చెముడుగుంట వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు అనికేపల్లి గ్రామానికి చెందిన కాకి నిరంజన్ మోటారుబైక్‌పై నెల్లూరుకు వెళ్లి తిరిగి అనికేపల్లికి వస్తుండగా చెముడుగుంట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని నిరంజన్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	141
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 7015
వెండి కిలో ధర	రూ. 86,100
వెండి ఒక గ్రాము	రూ. 88.10

'ఎస్‌ఆర్‌జే' లైబ్రేరియన్‌కు డాక్టరేట్



శ్రీనివాసులురెడ్డి

ఆత్మకూరు: స్థానిక ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ టీ.శ్రీనివాసులురెడ్డికి ఎస్వీయూ అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. 'నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండల గ్రామీణ సమాచార అవసరాలు-సమాచారం పొందే విధానాలు' అనే అంశంపై ఆయన పరిశోధనపత్రం సమర్పించినందుకు శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం అధికారులు పీహెచ్‌డీ అందచేశారు. శ్రీనివాసులురెడ్డిని శనివారం కళాశాల కరస్పాండెంట్ ఎస్.రాధాకృష్ణయ్య, ప్రిన్సిపాల్ వరలక్ష్మి, పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినం దించారు.

ఆర్వో కార్యాలయం సందర్శన

ఉదయగిరి రూరల్: నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని శనివారం వ్యయ పరిశీలకుడు జ్యోతి షైబైలంగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌తో చర్చించారు. దుత్తలూరు సెంటర్‌లోని పోలీస్‌చెక్‌పోస్టును తనిఖీ చేశారు.

బీఎస్పీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా కలిగిరి మండలం కృష్ణారెడ్డిపల్లి గ్రామానికి చెందిన క్రాకుటూరు పుష్పాంజలి శనివారం నామినేషన్ దాఖలు శారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కాకర్ల



వింజమూరు: టీడీపీలో చేరిన నాయకులతో వీపీఆర్, కాకర్ల

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 20: నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంతోపాటు గ్రామాలు, కాలనీల్లో మౌలిక వసతులను కల్పించడమే తన ధ్యేయమని ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. శనివారం బండకిందపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో మాట్లాడారు. తనతోపాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చామన్నారు. ఏళ్ల తరబడి ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతానన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు అనేక సమస్యలతో సతమతం అయ్యారని చెప్పారు. వైసీపీ నాయకులకు దోచుకుని దాచుకోవడమే తప్ప అభివృద్ధి తెలియదన్నారు. రూ.లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నా, ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలన్నా ఈ ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక:

ఈ సందర్భంగా బండకిందపల్లి సర్పంచ్ అంకినపల్లి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని కాకర్ల పార్టీ కండువాలతో ఆహ్వానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, నాయకులు శ్రీకుర్తి రవీంద్రబాబు, మల్లంపాటి గురవయ్యానాయుడు, మాదాల రామచంద్రయ్య, చీదర్ల మల్లికార్జున, పులివర్తి వెంకటేశ్వర్లు, చుండి హరిగోపాల్‌రెడ్డి, ఉండేల గురవారెడ్డి పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఉదయగిరికి చెందిన వైసీపీ నాయకులు రామలక్ష్మణులు మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. వారి వెంట పాటు వెయ్యి మంది అనుచరులు ఉన్నారు. వీరికి నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన రామలక్ష్మణులు చంద్రబాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మరో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, వింజమూరు మండలాధ్యక్షులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



దుత్తలూరు : టీడీపీలో చేరిన వారితో కాకర్ల, కంభం

వైసీపీ హయాంలో కొండలు, భూములు మాయం: కర్నాటి



ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు



సీతారామపురం: ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న మహిళా నాయకులు

సంగం: రాష్ట్రంలో స్వపరిపాలన అందించాలని ప్రజలు జగన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తే కొండలు, గుట్టలు, భూములు, ఇసుక దోచుకోమని వైసీపీ ఎమ్మెల్యేలకు, నాయకులు అప్పగించారని బీజేపీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులురెడ్డి విమర్శించారు. తిరిగి వైసీపీ వస్తే దోపిడీ, అరాచకాలు, దౌర్జన్యాలు మరింత పెరిగిపోతాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబును గెలిపించేందుకు ప్రజలు నిర్ణయానికి వచ్చారన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, కర్నాటి రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని సినిమాహాలువీధి, శ్రీనగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.

సీతారామపురం: గంగవరంలో మహిళలు శనివారం ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ -భవిష్యత్ గ్యారంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశంకు ఓటు వేయాలని, పార్టీ మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. రాజకీయాలలో 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుని తిరిగే మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఏ ఒక్కరికైనా ఆర్థిక సహాయం చేశాడా అని ప్రశ్నించారు. కాకర్ల సురేష్ రాజకియాల్లోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా వేల మందిని ఆదుకున్నాడని చెప్పారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు సారమ్మ, ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకట సుబ్బమ్మ, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, జనసేన మండల అధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఉత్తర బలిజవీధి, యాదవ వీధిలో ఎన్డీఏ కూటమికి చెందిన ఆనం రాయనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ నేతలు టీడీపీ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ భర్త షేక్ జిలానీ బాషా, మాజీ ఎంపీటీసీ షబ్బీర్ తన అనుచరులతో కలిసి శనివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరి వెంట పలువురు వార్డు మెంబర్లతో పాటు 50 కుటుంబాలు ఉన్నారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మి నాయుడు, అబ్బూరి రమేష్‌నాయుడు, కాటంరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అనంతసాగరం: బొమ్మవరం పంచాయతీ గోగులపల్లిలో శనివారం తెలుగు యవత అధ్యక్షుడు గూడూరు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ- భవిషత్తు గ్యారెంటీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తోట పరమేశ్వర్, జీ వెంకటరెడ్డి, అక్కులరెడ్డి జనార్ధన్‌రెడ్డి చుక్కప్రసాద్ పాల్గొన్నారు.

25 మందిపై బైండోవర్

సంగం, ఏప్రిల్ 20: మండలంలోని మర్రిపాడు, సంగంలో వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి బెయిల్‌పై వచ్చిన 25మందిని శనివారం తహసీల్దారు రమాదేవి ఎదుట హాజరు పరిచినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

వైభవంగా గరుడ వాహనసేవ

సంగం, ఏప్రిల్ 20: వంగల్లు కోదండరామస్వామికి శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహానికి గజ పూలమాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి టెంకాయలు కొట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

వింజమూరు, ఏప్రిల్ 20: స్థానిక ఎర్రవల్లిపాలెంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు ఆలయ నిర్వహణాధికారి బి.మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అంకురార్పణ, శనివారం ధ్వజారోహణం, ఆదివారం పొన్నమాను సేవ, సోమవారం హనుమంతసేవ, మంగళవారం గరుడసేవ, బుధవారం కల్యాణం, గురువారం రథోత్సవం, శుక్రవారం వసంతోత్సవం, శనివారం ఏకాంతసేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు గణపం వెంకటరమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

కావలి కందుకూరు


ఉలవపాడు : ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నేతలు


లింగసముద్రం : కరపత్రాలు పంపిణీ చేస్తున్న...

ఇంటింటా టీడీపీ నేతల ప్రచారం

కొండాపురం, ఏప్రిల్ 20 : మండలంలోని ఉప్పులూరు పంచాయతీ కొత్త ఉప్పలూరులో టీడీపీ నాయకులు ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను ఆశీర్వదించాలంటూ స్థానిక నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల కర పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కుంకు జయమ్మ, సర్పంచు వల్లేటి కొండలరావు, యూనిట్ ఇన్‌చార్జి కుమ్మరి వెంకటరావు, పరిశీలకులు కె.సుబ్బారావు, యారవ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


కొండాపురం : ఇంటింటి ప్రచారంలో మహిళలు

ఉలవపాడు : ఉలవపాడు హైస్కూల్ సంఘంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. జగన్ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు, విద్యుత్ చెర్జీలు పెంపును వివరిస్తూ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను గెలిపించి తద్వారా చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

లింగసముద్రం : రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలిస్తేనే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతితో పాటు, ఉపాధి అవకాశాలు దక్కుతాయని తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, మాజీ ఎంపీపీ పి బాలకోటయ్యలు చెప్పారు. లింగసముద్రంలో టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలంకి ప్రసాద్, ఎలిపాటి శ్రీను, జంపాల శివప్రసాద్, కమ్మిశెట్టి శ్రీనివాసులు, అంద్రా హరి, ఎం రవికుమార్, పి మాల్యాద్రి కె మహేష్, కోనూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జేబీ చరిత్ర గొప్పది : డీఎంహెచ్‌వో

కావలిటౌన్, ఏప్రిల్ 20: జవహర్ భారతి కళాశాల చరిత్ర చాలా గొప్పదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. శనివారం జేబీ డిగ్రీ కళాశాల ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ఫిజికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆర్ మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన క్రీడా దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభావంతులైన క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ తాను జేబీ పూర్వ విద్యార్థినైనందుకు గర్వపడుతున్నానన్నారు. జేబీ కళాశాలను తలచుకున్నా సందర్శించినా హృదయం పులకరిస్తుందని, విద్యా ర్థి దశలో జ్ఞాపకాలు గుర్తుకొస్తాయన్నారు. విశ్వోదయ వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) క్రీడలకు ప్రాముఖ్యతనిచ్చేవారన్నారు. అన్ని రోగాలకు వైద్యం వ్యాయామని, క్రీడాకారులు శారీరక దృఢత్వంతోపాటు మానసిక దృఢత్వం కలిగి ఉంటే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో పెంచలయ్య, పూర్వ పీడీ కోటేశ్వరమ్మలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజగోపాల్, కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, పీడీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.


క్రీడాకారులతో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

చంద్రబాబు సమక్షంలో
టీడీపీలో చేరిన నాయుడు రాంప్రసాద్


రాంప్రసాద్‌కు కండువా వేస్తున్న చంద్రబాబునాయుడు

కావలి, ఏప్రిల్ 20: రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ నాయుడు రాంప్రసాద్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి శనివారం ఉదయం రాజీనామా చేసిన జిల్లాలోని పొదలకూరులో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును కలిశారు. వెంటనే బాబు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉండిన నాయుడు రాంప్రసాద్ గత ఎన్నికల్లో వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి టీడీపీనేత పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

నేడు చుండి మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

వలేటివారిపాలెం, ఏప్రిల్ 20 : మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ఉదయం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. మొత్తం 125 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

మంచి విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు


అల్లూరు : భారీ కేక్ కట్ చేస్తున్న కావ్య కృష్ణారెడ్డి, బీద గిరిధర్, తదితరులు


వలేటివారిపాలెం : టీడీపీ కార్యాలయంలో...

● అట్టహాసంగా జన్మదిన వేడుకలు

అల్లూరు, ఏప్రిల్ 20 : మంచి విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని, ఇటువంటి నాయకులు అరుదుగా ఉంటారని, మన రాష్ట్రానికి ఉండడం అదృష్టంగా భావించాలని కావలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని శింగపేటలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం స్థానిక నేత బండి అమర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, బండి అమర్‌రెడ్డి, జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ సుందరరామిరెడ్డిలతో కలసి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, పావనబోయిన రత్తయ్య, అరగల రమణయ్య, బండి శ్రీనివాసులు రెడ్డి, ఆట తిరుమల తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయు డు జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం అట్టహాసంగా జరుపుకున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి నేతలకు తినిపించారు. సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరోసారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శప్రాయంగా, జనరంజకంగా పాలన కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నే రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, బీజేపీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ కమిటీల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులు ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పరిటాల భాస్కర్‌రావు, నాయకులు కాకుమాను అంజనేయులు, వలే టి నరసింహం, వలేటి శ్రీధర్‌నాయుడు, కొంకా రమేష్, కాకుమాను హర్షకుమార్, వీరమోసు అంజయ్య, గుత్తా కొండయ్య, వలేటి మధుసూదన్‌రావు కాకుమాను మాల్యాద్రి, మీసాల మాల్యాద్రి, బూదాల మాధవరావు, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ ఎం.ఓంకారం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీని గెలిపించుకొని చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి సుబ్బారావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.మల్లికార్జున, నాయకులు యారవ కృష్ణయ్య, పోలినేని రమేష్, చెరుకూరి వెంకటాద్రి, పి.చంద్రబాబునాయుడు, ఎస్.శివన్నారాయణ, డి.అశోక్, బి.మాచర్ల, తిమోతి, అల్లిక మధు, వి.వెంకటేశ్వర్లు, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలు మండల పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పార్టీ శ్రేణులు కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు జిందాబాద్ అంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగసముద్రం : నారా చంద్రబాబునాయు డు జన్మదిన వేడుకలు టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పలువురు నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుళ్లా సుధాకర్, పి మాల్యాద్రి, దేవకి సుబ్రహ్మణ్యం, పి బాలకోటయ్య, సీహెచ్ బాలకోటయ్య, కండే మాలకొండయ్య, ఎన్ నారాయణ, ఎ నర్సయ్య, జంపాల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.


లింగసముద్రం : సంబరాల్లో టీడీపీ నేతలు


కొండాపురం : కేక్ తినిపించుకుంటున్న నాయకులు

23న ఇంటూరి నామినేషన్


మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 20 : కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఈనెల 23వ తేదీదిన నామినేషన్ వేయనున్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఇంటూరి మాట్లాడతు చంద్రబాబు నాయుడు, లోకేష్‌బాబు ఆశీస్సులతో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ వేస్తానని తెలిపారు. మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి, కందుకూరు ప్రజల ఇలవేల్పు అంకమ్మ దీవెనలు, నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదాలు తనకు ఉన్నాయన్నారు.

టీడీపీలో చేరికలు

మండలంలోని పెంట్రాల పంచాయతీ చీమలపెంటకు చెందిన ముత్తులూరి సుధాకర్, గంగినేని మధుసూదనరావు ఆధ్వర్యంలో వైసీపీ నేతలు గుడిపూడి వెంకటేశ్వర్లు, గుడిపూడి తిరుపతయ్య కుటుంబాలు ఆ పార్టీని వీడీ టీడీపీలో చేరారు. వారికి ఇంటూరి నాగేశ్వరరావు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు.

మాజీ ఎమ్మెల్యే పోతులను కలిసిన ఇంటూరి

కందుకూరు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు శనివారం మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుని తన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 23వ తేదీన నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలు, సలహాలు, సూచనలు ఇచ్చారు.

మాలకొండ ఆదాయం రూ.7,72,049

వలేటివారిపాలెం, ఏప్రిల్ 20 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.7,72,049 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ. శ్రీనివాసరావు తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ.5,700, కుంకుమార్చన ద్వారా రూ.18,880, వివాహములకు రూ.3 వేలు, తలనీలాల సమర్పణకు రూ.37,775, వాహన పూజలు ద్వారా రూ.3,380, ప్రత్యేక దర్శనానికి రూ.2,00,100, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 820, రూము అద్దెలు ద్వారా రూ. 33,200, కవర్లు విక్రయం రూ.5,400, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,04,200, అన్నదానం ద్వారా రూ. 2,44,478, విరాళముల ద్వారా రూ. 15,116 ఆదాయం లభించినట్లు తెలిపారు.

లక్ష్మీనరసింహుడి సేవలో ఎమ్మెల్సీ మాధవరావు

మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావు తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. మాధవరావుకు ఆలయ అధికారులు ఆలయ సకల మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో ప్రధా న ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు మాధవరావుకు శాలువా, పూలమాలతో సత్కరించారు.

అగ్నిమాపక పరికరాలపై అవగాహన

కావలి రూరల్, ఏప్రిల్ 20: కావలి అగ్నిమాపక కేంద్రం ఆవరణలో శనివారం విద్యార్థులకు అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అగ్నిమాపక కేంద్రం అధికారి జి.రామసిద్ధార్థ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకుని అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు 101, 08626 243101, 9963734286ను సంప్రదించాలని కోరారు.


అవగాహన కల్పిస్తున్న రామసిద్ధార్థ


అభివృద్ధి చేస్తారని గెలిపిస్తే దోచుకుతిన్నారు!

● టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 20 : అభివృద్ధి చేస్తారని రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే దొరికినకాడికి దోచుకు తిన్నాడని టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని బట్రకాగొల్లు, నార్తుఆములూరు, బీరంగుంట, సింగపేట గ్రామాల్లో ఆయన నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలతో కలసి రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నార్తుఆములూరు, నార్తుమోపూరు గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం నిధులు మంజూరు చేయించి బీద రవిచంద్ర రైతులకు మేలు చేకూర్చాలని ప్రయత్నిస్తే ప్రతాప్ కుమార్‌రెడ్డి గెలిచి ఈ గ్రామ రైతులకు శాపంగా మారిందన్నారు. గ్రావెల్ అమ్ముకొని రూ.కోట్లు సంపాదించుకున్న వ్యక్తి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. టీడీపీ రైతులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తే దోచుకునేందుకు వైసీపీ సిద్ధపడిందన్నారు. గత ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి కోడికత్తి డ్రామాతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కాడని మరలా అదే పంథా కొనసాగించేలా నేడు గులకరాయి కారణాన్ని చూపిస్తున్నాడన్నారు. జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా తనను, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండి అమర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గుంజి రుద్రయ్య, పెయ్యల భాస్కర్, దాసరి ప్రభాకర్, శ్రీనివాసులు, అరగల రమణయ్య, రామకృష్ణారెడ్డి, కప్పిర విష్ణు, బండి శ్రీనివాసులు రెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురు చేరిక

బిట్రగుంట : బోగోలు పంచాయతీ అరవపాళెంకు చెందిన మాజీ సర్పంచు ప్యాట్రిక్ ఆధ్వర్యంలో కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డికి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిచారు. అనంతరం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు నాగేశ్వరావు, మధుబాబు నాయుడు, సుధీర్ బాబు, వెంకటేశ్వర్లుయాదవ్, బీ.యోహాన్, అంజయ్యయాదవ్, శ్రీనివాసులు యాదవ్, ఎంఎ రవి తదితరులు పాల్గొన్నారు.


బిట్రగుంట : క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న మాజీ సర్పంచు ప్యాట్రిక్

జనసేన నాయకుల ఘర్షణ

కావలి రూరల్, ఏప్రిల్ 20: కావలి పట్టణం అరుంధతీయ వాడలో శనివారం జనసేన నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. 1వ పట్టణ పోలీసులు, బాధితుల వివరాల మేరకు... పట్టణంలోని అరుంధతీయవాడ జనసేన నాయకుడు మంద శ్రీనివాసులు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అలహరి సుధాకర్‌తో కలసి ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న స్థానిక జనసేన నాయకుడు చేవూరి నాయబ్ తనకు చెప్పకుండా నా ఏరియాలో ప్రచారానికి ఎలా వస్తారని గొడవ పెట్టుకుని అక్కడ ఉన్న అల శ్రీనాథ్ చొక్కా చించి వేయడంతో పాటు అలహరి సుధాకర్‌ను రాయితో కొట్టబోగా అడ్డుకోవటంతో రాయి తగిలి శ్రీనివాసులు వేలుకు రక్తగాయం అయ్యింది. అతని ఫిర్యాదు మేరకు 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీ స్టేడియం @ 24 ఏళ్లు!

- పునాదుల దశ దాటని నిర్మాణం
- శిథిలావస్థకు చేరిన శిలాఫలకం
- గత టీడీపీ ప్రభుత్వంలో పనుల ప్రారంభం
- నిధులు చాలవంటూ అడ్డుకున్న ఎమ్మెల్యే
- వైసీపీ పాలనలో మంజూరు కాని నిధులు
- కావలిలో కలగా మిగిలిన క్రీడా వికాస కేంద్రం


పునాదుల దశ దాటని క్రీడా వికాస కేంద్రం


శిథిలమవుతున్న శిలాఫలకం

కావలిటౌన్, ఏప్రిల్ 20 : వ్యక్తి వికాసానికి క్రీడలు దోహదపడతాయని, విద్యార్థికి విద్య, క్రీడలు రెండు కళ్లు అని పాలకులు, అధికారులు పదే పదే ఉపన్యాసాల్లో ఊదరగొట్టడం.. ఉత్తుత్తి హామీలు ఇవ్వడం తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. అందుకు నిదర్శనం కావలిలో మినీ స్టేడియం నిర్మాణానికి వేసిన శిలాఫలకం శిథిలావస్థకు చేరి 24 ఏళ్లుగా ఎక్కిరిస్తుండడమే. వివరాల మేరకు.. కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులో 2001లో మినీ స్టేడియం నిర్మాణానికి కోట్ల రూపాయలు విలువ చేసే 9 ఎకరాల స్థలం కేటాయించారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప స్టేడియం నిర్మాణం మాత్రం జరగడంలేదు. అదిగో అల్లదిగో స్టేడియం అంటూనే రెండున్నర దశాబ్దాలు గడిచి పోతున్నాయి. అప్పటి క్రీడాకారుల పిల్లలకు కూడా ఆటలాడే వయసు దాటిపోయింది. వారి మనవళ్లకైనా స్టేడియం అందుబాటులోకి వస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

● 2014లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన టీడీపీ ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యుడీసీ)ఆధ్వర్యంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఒక్కో దానికి రూ.2 కోట్ల చొప్పున ప్రతి నియోజకవర్గానికో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కావలి, విడవలూరు(కోవూరు,) ఆత్మకూరు, కోట, సూళ్లూరుపేట, ఉదయగిరిలలో క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలు ప్రారంభించారు. ఈ క్రమంలో కావలిలో స్టేడియం మైదానంలో క్రీడా వికాస కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించి పునాది నిర్మాణం పూర్తి చేసుకునే సమ యంలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. ఈ క్రమంలో మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2కోట్లు సరిపోవని రూ.5.50 కోట్లతో ప్రతిపాదనలు పం పామంటూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిర్మాణ పనులు అడ్డు కున్నారు. గడిచిన 5ఏళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. దీంతో మినీ స్టేడియం నిర్మాణం కావలి వాసులకు కలగా మిగిలింది. గత ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అంగుళం ముందుకు కదలకపోవడంతో జరిగిన పనులు సైతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో క్రీడాకారుల సంక్షేమమే మాధ్యేయం.. క్రీడాకారులను ప్రోత్సహిస్తాం.. క్రీడా మౌలిక వసతులు కల్పిస్తామన్న నేతల మాటలు నీటి మూటలుగా మారాయి. వైసీపీ ప్రభుత్వం క్రీడలను క్రీడాకారులను పూర్తిగా విస్మరించిందనేందుకు ఇక నిదర్శనం. ఇదిలావుండగా క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, తగిన శిక్షణ, ప్రోత్సాహం అందించకుండా వైసీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం కోసం ఇటీవల నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర అట్టర్ ఫ్లాప్ షోగా మిగిలిందే తప్ప నిజమైన క్రీడాకారులకు ఒరిగిందేమీ లేదు.

ఎన్నికల కోడ్ ఉన్నా ఇష్టారాజ్యం

● రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

కావలి రూరల్, ఏప్రిల్ 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టణంలోని 38వ వార్డు చేవూరివారితోటలో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైసీపీ నేతలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని కోడ్ అమలులో ఉండగా పనులు చేపట్టవద్దని అడ్డుకున్నారు. దీంతో రోడ్డు నిర్మాణానికి తెచ్చిన సామగ్రిని వైసీపీ నేతలు అక్కడ వదిలి వెళ్లిపోయారు. ఈ విషయంపై కావలి మున్సిపల్ డీఈ సాయిరాంను వివరణ కోరగా కోడ్ మునుపు నిర్మాణ పనులు చేట్టిన రోడ్డుకు కనెక్టివిటీగా ఈ రోడ్డు పనులు ఉండటంతో వాటిని ప్రారంభించారని, ఎంసీసీ అభ్యంతరంతో పనులు ఆపివేశామన్నారు.

మళ్లీ గెలిపిస్తే అభివృద్ధి చేస్తాం

అల్లూరు, ఏప్రిల్ 20 : మరోసారి వైసీపీకి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని నెల్లూరు పార్లమెంటు వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీలో ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలతో కలసి ఆయన శనివారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇస్కపల్లి గ్రామాభివృద్ధి జరగాలంటే వైసీపీకి ఓటేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కావలిలో మూడో రోజు
నాలుగు నామినేషన్లు

కావలి, ఏప్రిల్ 20: కావలి అసెంబ్లీకి మూడవ రోజు శనివారం నలుగురు నేతలు తమ నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందజేశారు. పిరమిడ్ పార్టీ తరుపున సబ్బెల విజయభాస్కర్‌రెడ్డి, రెవెల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ తరుపున గోసాల రవికాంత్, స్వతంత్ర అభ్యర్థిగా రాచూరు వెంకటసుబ్బారావులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. అలాగే బహుజన సమాజ్ పార్టీ తరుపున గుంజి వెంకటేశ్వర్లు రెండో సెట్టు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన గురువారం కూడా ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

ఆర్ఎస్ఆర్‌లో వర్క్‌షాప్

బిట్రగుంట, ఏప్రిల్ 20: బోగోలు మండలం కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల్లో శనివారం వడ్డే నేషనల్ ప్రోగ్రాం ఆన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020, అవుట్ కం బెస్ట్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) టైటిల్‌పై ఒక్కరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వీపీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం రిసోర్స్ పర్సన్‌గా కేఎల్ యూనివర్సిటీ లోని ప్రొఫెసర్ డాక్టర్ కే.రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ఎస్‌డీ ముజాహిద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవధార సోమశిల ప్రాజెక్టు జిల్లాకే తలమానికం. సుమారు 8 లక్షల ఎకరాలకు సాగు, పది లక్షల ప్రజానీకానికి తాగు నీరు అందిస్తున్న మహోత్తర జలనిధి అయిన ఈ డ్యాం నేడు సమస్యల సుడిలో చిక్కుకుపోయింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా డ్యాం మనుగడకే ప్రమాదం నెలకొంది. పోటెత్తిన లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని డ్యాం తట్టుకుని నిలబడుతున్నా మరమ్మతులు, నిర్వహణలో మాత్రం పాలక యంత్రాంగం చేతులెత్తేస్తోంది. ప్రకటించిన నిధులు కూడా సరిగ్గా రాకపోవడంతో భవిష్యత్తులో సోమశిల మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తుందని జిల్లావాసులు గగ్గోలు పెడుతున్నారు.

- అనంతసాగరం

- నీటి సామర్థ్యం పెంచినా కానరాని అభివృద్ధి
- పోటెత్తిన వరదలకు దెబ్బతింటున్న నిర్మాణాలు
- మరమ్మతుల్లో చేతులెత్తేస్తున్న వైసీపీ సర్కారు




అడుగంటిన సోమశిల జలాశయం

పాలకులకు పట్టని
జలనిధి!

- సమస్యలు సుడిగుండంలో ‘సోమశిల’

పెంచిన నిల్వకు అనుకూలమేనా!?

సోమశిల క్యాచ్‌మెంట్ ఏరియాపై అధికారుల పర్యవేక్షణ కరువయ్యింది. డ్యాం సామర్థ్యం 75 నుంచి 78 టీఎంసీలకు పెంచినా ఎగువ ప్రాంత అభివృద్ధిని మాత్రం విస్మరించారు. ఎగువ నుంచి వచ్చే వరదతో ప్రాజెక్టు చెంతన పూడిక పేరుకొని ఉండవచ్చు. అయితే ఈ విషయంపై యంత్రాంగం అసలు దృష్టి సారించ లేదన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం జలాశయం పూర్తిస్థాయి నిల్వకు అనుకూలంగా ఉందా!? లేదా!? అనే అంశంపై కూడా అనుమానం కలుగుతోంది. ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం డ్యాంలో 8.5 టీఎంసీల నీరు ఉంది. వాస్తవికతో పరిశీలిస్తే అంత నీటి నిల్వ ఉండదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



క్రస్ట్ గేట్ల నుంచి లీకవుతున్న నీరు (ఫైల్)

సోమేశ్వరుడినీ పట్టించుకోలా

2020, 2021 ఏడాదిలో సోమశిలకు ఎగువ నుంచి వచ్చిన వరదలతో జలాశయ ప్రాంగణంలోని ప్రముఖ సోమేశ్వరుడి ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించామని పాలకులు చెబుతున్నా ఆ దిశగా అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవు. చరిత్ర కలిగిన గుడి నేడు దెబ్బతిని ఉండగా భక్తులు తీవ్ర వేదనకు గురువుతున్నారు.

ఆఫ్రాన్ పనులకు మంగళం

రెండేళ్లపాటు సోమశిలకు వచ్చిన వరదతో జలాశయం ముందు కట్టడాలు ధ్వంసమైన సంగతి తెలిసిందే. జలాశయం నిర్మాణంలో అఫ్రాన్ ప్రాంతం కీలమైన నిర్మాణం కాగా దెబ్బతిన్న నిర్మాణాలు యథాస్థితికి తెచ్చేలా తీసుకొన్న ప్రణాళికలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. అఫ్రాన్ నిర్మాణం కోసం రూ.99.11 కోట్లు ప్రతిపాదించగా నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాదిన్నరగా మరమ్మతు పనులు జరగలేదు. దీంతో ఆ కట్టడాలు మరింత ప్రమాదభరితంగా మారాయి.



అధ్వానంగా అసంపూర్తిగా నిలిచిన అఫ్రాన్ పనులు

క్రస్ట్‌గేట్ల వ్యవస్థ అధ్వానం

ప్రాజెక్టుకు అమర్చిన క్రస్ట్‌గేట్ల వ్యవస్థ సరిగా లేదు. ఏటా నీరు వదిలే సమయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పోటెత్తిన వరద తిరిగి తగ్గే వరకు ఇంజనీర్లు ఉత్కంఠకు గురువుతున్న పరిస్థితి. ఏ సమయంలో ఏ గేటు మొరాయిందోనన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. మొత్తం 12 క్రస్ట్‌గేట్లు ఉండగా.. ఒక్కో గేటు 15 మీటర్ల వరకు ఎత్తేలా డిజైన్ చేసి ఉంది. వరద పోటెత్తినప్పుడు మొత్తం గేట్ల నుంచి గరిష్ఠంగా 5.5 లక్షల క్యూసెక్కుల వరకు నీరు వదిలే వెసులుబాటు ఉంది. అయితే గడిచిన ఐదేళ్ల కాలంలో వరద సమయంలో పలుగేట్లు మొరాయించి సిబ్బంది అవస్థలు పడిన సందర్భాలు ఉన్నాయి. ఏటా గేట్లకు చేయాల్సిన ఆధునికీరణ పనులపై శ్రద్ధ లోపించింది. జలాశయం నిండిన సందర్భంలో గేట్ల సీళ్ల దెబ్బతిని లీకేజీ కొనసాగుతున్నా నివారణ పనులు చేస్తున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ తక్కువగా ఉంది. ఈ సమయం పనులకు అనుకూలమైనా యంత్రాంగంలో చలనం లేదు.

గ్యాలరీలో సమస్యలు

జలాశయం గ్యాలరీ ప్రాంతంలో లీకేజీ అధికంగా ఉంటుంది. లీకేజీని తోడేందుకు 24 గంటలపాటు సిబ్బంది పని చేయాల్సిన అవసరం ఉండగా సిబ్బంది కొరత కారణంగా ఉన్న వారిపై పనిభారం పెరిగి శారీరక, మానసిక వేదనతో ఇబ్బంది పడుతున్నారు. ఇక గ్యాలరీకి అనుసంధానించిన లిఫ్ట్ కొన్నిసార్లు సాంకేతికతో మరమ్మతులకు గురువుండగా ఉద్యోగులు మెట్ల మార్గం నుంచి 100 అడుగుల కిందకు వెళ్లి విధులు నిర్వహించాల్సి ఉంది.

మట్టికట్ట పటిష్టంగా ఉందా!?

జలాశయం మట్టికట్ట పటిష్టతపై అనుమానం కలుగుతోంది. మట్టికట్ట నిర్మాణంపై ఏటా పరీక్షలు నిర్వహించి భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా పనులు చేసిన సందర్భాలు కరువయ్యాయి. దీంతో మట్టికట్టకు - కాంక్రీట్ నిర్మాణానికి వ్యత్యాసం నెలకొనగా సరిచేసే చర్యలు కరువయ్యాయి. ఇక కరకట్టలపై ఏర్పాటు చేసిన రివెట్‌మెంట్లపై మొక్కలు మొలచి మానులుగా మారుతున్నా చర్యలు లేవు.

పడకేసిన పర్యాటకం

జలాశయం వద్ద 2013లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన అతిథి భవన సముదాయం శిథిలావస్థకు చేరుకొంది. సుమారు 100 మంది బస చేసేలా డార్మెంటరీ ని వినియోగించుకోలేని పరిస్థితి. కోట్లాది రూపాయాలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు కూనరిల్లుతున్నాయి. ఇక వసతి ఏర్పాట్లు లేక సోమశిలకు వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.

అభివృద్ధికి నోచని కాలువలు

సోమశిల జలాశయం పరిధిలో ఉత్తర, దక్షిణ కాలువలు ఉండగా ఆదునికీరణ పనులు పడకేశాయి. ఉత్తర కాలువ 0 నుంచి 106 కి.మీ కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడు వరకు విస్తరించి ఉండగా కాలువ సామర్థ్యం పనులు చేసేలా చర్యలు చేపట్టారు. 750 క్యూసెక్కుల నుంచి 1,550 క్యూసెక్కులకు పెంచేలా ప్రణాళిక చేశారు. ఇదే తరహాలో దక్షిణ కాలువను 350 నుంచి 700 క్యూసెక్కులకు పెంచేలా తీసుకొన్న చర్యలు పూర్తిస్థాయిలో అమలు జరగక పోవడంతో పనులు స్తంభించాయి. ఇక తెలుగుగంగ వరద కాలువ గేటు ఏటా మొరాయిస్తోంది. జాకీలు పెట్టి గేటును ఎత్తాల్సిన పరిస్థితితో నీరు విడుదల, నిలుపుదల సమయంలో సిబ్బంది పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

జలాశయ పరిసరాల్లో రోడ్లు ధ్వంసం

ప్రాజెక్టు పరిసరాల్లో సుమారు 5 కి.మీ రోడ్లు విస్తరించి ఉండగా అవి అధ్వానంగా ఉన్నాయి. డ్యాం ఘాట్‌రోడ్డు రాళ్లు తేలి నరకప్రాయంగా ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దశాబ్ద కాలంగా రోడ్ల అబివృద్ధి జరగలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరికీ ప్రతిష్టాత్మకమే!

ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల పోరు ఆసక్తిగా మారింది. మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థిగా, సిట్టింగ్ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అర్థ, అంగ బలాల్లో ఇద్దరూ సమ ఉజ్జీలే. అయితే వైసీపీ నుంచి టీడీపీలోకి రోజు రోజుకు వలసలు జోరందుకుంటున్నాయి. ఆనం పోటీలో ఉండడం టీడీపీ శ్రేణుల్లో జోష్ పెంచింది.

-ఆత్మకూరు



ఆనం రామ నారాయణ రెడ్డి



మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆనం రామనారాయణరెడ్డి 2009లో తొలిసారిగా ఆత్మకూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి కూడా పనిచేశారు. అప్పట్లో ఆయన నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోట్ల నిధులు మంజూరు చేయించి, పలు అభివృద్ధి పనులు చేశారు. ముఖ్యంగా తాగు, సాగునీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆత్మకూరు రెవె న్యూ డివిజన్ ఏర్పాటు, మున్సిపాలిటీగా మార్పు, 100 పడకల ప్రభుత్వ వైద్యశాల, ప్రభుత్వ పాలిటె క్నిక్, ఐటీఐ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, హైలెవల్ బ్రిడ్జీలు, ఆత్మకూరు ప్రజలకు శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు సోమశిల నుంచి పైపులైను ఏర్పాటు పనులు చేయిం చారు. అప్పటి నుంచి ఆయన ఎక్కడ ఉన్నా ఆత్మకూరు ప్రజల ఆదరాభి మానాలకు దూరం కాలేదు. నియోజకవర్గంలో టీడీపీ అగ్రనేతలంతా ఏకం కావడం ఆనంకు మరింతగా కలిసివచ్చే అంశం. వర్గబలం గల కొమ్మి, బొల్లినేని, గూటూరు, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిల కలయిక ఆయన విజయానికి అదనపు బలం. వీటికి తోడు వైసీపీ ప్రభుత్వంపై ఉన్న ప్రజావ్యతిరేకత కూడా కలిసొచ్చే అంశం.

- పదేళ్లు నైరాశ్యం

ఆది నుంచి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఆత్మకూరులో పదేళ్ల క్రితం మేకపాటి కుటుంబం నుంచి రాజకీయ ఆరంగేట్రం చేసిన గౌతంరెడ్డిని ప్రజలు గెలిపించారు. 2019లోనూ గౌతమ్ విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆయన ఆకస్మిక మర ణంతో 2022లో జరిగిన ఉప ఎన్ని కల్లో ఆయన సోదరుడు విక్రమ్‌రెడ్డి విజయం సాధించారు. వైసీపీ ప్రాబల్యం పైనే ఆయన విజయం ఆధారపడి ఉంది. ఈ క్రమంలో నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో తన ప్రాబల్యం తగ్గకుండా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. అయితే పలువురు వైసీపీ నాయకులు పార్టీలో మారుతుండటం మేకపాటికి కంటి మీద కునుకులే కుండా చేస్తోంది. అంతేగాక ఆశించిన మేర నియోజకవర్గంలో అభివృద్ధి జరగకపోవడం ప్రతికూల అంశమైంది. 2014, 2019 ఎన్నికల్లో మేకపాటి గౌతంరెడ్డి పెద్దగా హామీలు ఇవ్వలేదు. ఇచ్చిన మూడు, నాలుగు హామీల సైతం నెరవేర్చలేదు. అసెంబ్లీలో గళమెత్తి పోరాడిన దాఖలాలు కూడా లేవు. ఇవన్నీ ప్రజల అసంతృప్తికి కారణమయ్యాయి.

వర్తమానం

వాళ్లకు వాళ్లే కండువాలు కప్పుకుని..

- టీడీపీ నేతలు చేరారంటూ వైసీపీ ఫేక్ ప్రచారం

ఉలవపాడు: టీడీపీకి చెందిన పలు కుటుంబాలు భారీగా తమపార్టీలో చేరినట్లు ఫేక్ ప్రచారాలతో వైసీపీ నాయకత్వం ఆత్మసంతృప్తి పొందుతోంది. అయితే ఈ విషయాన్ని కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు ఓ ప్రకటనలో ఖండించారు. కాలనీలో తొలినుంచి కాంగ్రెస్‌లోనూ, అనంతరం వైసీపీలోనూ సాను భూతిపరులుగా ఉంటున్న ఒకటిరెండు కుటుంబాలవారికి వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ సమక్షంలో శుక్రవారం కండువాలు కప్పి టీడీపీవారు చేరారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. అయితే ఆ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు మాత్రం వైసీపీ ఫేక్ ప్రచారాలపై మండిపడుతున్నారు. గత నాలుగు రోజుల క్రితం కూడా టీడీపీ యువత భారీగా వైసీపీలో చేరిందని ప్రచారం చేసుకున్నారు. అలా చేరినవారిలో సగానికిపైగా ఓటు హక్కులేని విద్యార్థులని తేలింది. ఓవైపు మండలంలో ప్రతిగ్రామం నుంచి టీడీపీలోకి రోజురోజుకు వలసలు పెరిగిపోతుంటే, వైసీపీలో ఏర్పడిన అనిశ్చితి చర్చనీయాంశంగా మారింది.



వైసీపీ నాయకులకే పార్టీ కండువాలు కప్పి మళ్లీ వైసీపీలోకి ఆహ్వానిస్తున్న బుర్రా మధుసూదన్

వారు తొలగించడం.. వీరు కట్టడం!

‘కోడ్’ను ఖాతరు చేయని అధికార పార్టీ నేతలు

తల పట్టుకుంటున్న అధికార యంత్రాంగం

సంగం, ఏప్రిల్ 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా తమనేమి చేస్తారనే ధీమానో లేదా అహంకారమో తెలియదు కానీ సంగం మండలంలోని సిద్ధీపురం, వెంగారెడ్డిపాళెం, సంగం గ్రామాల్లో అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా మారింది. కొందరు వైసీపీ మద్దతుదారులు స్థానికుల ఇళ్ల గోడలపై జగన్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న అధికారులు ఇళ్ల యజమానులను అడిగితే ఎవరో వచ్చి కట్టి వెళుతున్నారని, ఈ విషయం మాకు తెలియదని సమాధానం ఇస్తున్నారు. దీంతో అధికారులు ఫ్లెక్సీలను తొలగించి చేతులు దులుపుకున్నారు. శుక్రవారం సంగంలో పలు ఇళ్లకు ఈ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఇలా ఇష్టప్రకారం ఫ్లెక్సీలను కడుతుండటంతో వాటిని తొలగించలేక అధికార యంత్రాంగం తల పట్టుకుంటోంది.



సంగంలోని ఓ దుకాణం గోడకు కట్టిన వైసీపీ బ్యానర్

ఎన్నికల విధుల్లోకి శిక్షణ ఐపీఎస్‌లు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి అన్ని జిల్లాలకు శిక్షణ ఐపీఎస్‌లను కేటాయిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాకు మయాంక్ మిశ్రా, ప్రతీక్‌సింగ్, కుష్‌మిశ్రా, సురజ్ డి, అబినవ్ ద్వివేది, జామాసోనార్, ఆషిమా వాశ్వాణి, అపర్ణలను కేటాయించారు. జిల్లాలోని నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవార్గాలకు ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ట్రైనీ ఐపీఎస్‌ను పర్యవేక్షణాధికారిగా నియమించనున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు వీరంతా జిల్లాలోనే ఉంటూ విధులు నిర్వహించనున్నారు.

మా రోజుల్లో

నెరవేర్చే హామీలే ఇచ్చేవారు!?



మేము వయసులో ఉన్న రోజుల్లో రాజకీయం ఎంతో నీతిగా విలువలతో కూడిన విధంగా ఉండేది. ప్రజలకు సేవ చేసే వారికి మాత్రమే పార్టీ పెద్దలు సీట్లు ఇచ్చేవారు. ఎన్నికల వేళ ప్రజలే వారి ఆర్థిక బాగోగులు చూసేవారు. బరిలో ఉన్న నేతలు నెరవేర్చే హామీలను మాత్రమే చెప్పి ఓట్లు అడిగే వారు. గెలిచాకా ఇచ్చిన వాగ్ధానాలు తీర్చేవారు. అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా కనిపిస్తోంది. ఇప్పుడు ప్రచార ఆర్భాటం ఎక్కువగా ఉంది. మా రోజుల్లోలాగే ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఖర్చులు తగ్గి దేశ ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగుపడి ఉండేది.

- రామయ్యనాయుడు (81), సంజీవనగరం, అనంతసాగరం

తెలుసుకుందాం

బైండోవర్ అంటే...

ఏ ఎన్నికలు వచ్చినా తరచూ వినిపించేమాట బైండోవర్... అనగా బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచుతారు, గొడవలు సృష్టించేవారు, రౌడీషీటర్లు, బెల్టు దుకాణాదారులు, అసాంఘిక శక్తులపై నిఘా కూడా పెంచుతారు. ఎన్నికలవేళ ఫలానా వ్యక్తుల వల్ల శాంతిభద్రతలకు ఇబ్బంది కలుగుతుందని భావిస్తే, అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిస్తే పోలీసులు బైండోవర్ చేస్తారు. అలాంటి వారిని తహసీల్దారు లేదా ఆర్డీవో ఎదుట హాజరు పరుస్తారు. చట్టవ్యతిరేక పనులు చేయబోమని బాండ్ పేపర్ మీద లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి ఆరోజు నుంచి ఏడాదిపాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే ఇచ్చిన బాండులో ఎంత మొత్తం నమోదు చేసి ఉంటారో.. అంత మొత్తం జరిమానా చెల్లించాలి. అలా చెల్లించకపోతే నేరంగానే పరిగణిస్తారు. అతడిపై ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద కేసు నమోదు చేస్తారు. రెండు అంతకన్నా ఎక్కువ సార్లు బైండోవర్ అయితే రౌడీషిట్ నమోదు చేసే అవకాశం ఉంది. అక్రమంగా పోలీసులు బైండోవర్ పెట్టారని ఎవరైనా భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు.

- అనంతసాగరం/ఉదయగిరి రూరల్

యువగళం

సమర్థులైన పాలకులను ఎన్నుకుంటా!



ఓటు అనే ఆయుధం దేశ, రాష్ట్ర ప్రజల తలరాతలు మార్చేలా ఉండాలి. అవినీతికి దూరంగా ఉండే సమర్థమైన నాయ కుడికి నా ఓటు వేస్తా. డిగ్రీ వరకు చదివా. ఈసారి ఎన్నికల్లో తొలి సారిగా ఓటు వేసే అవ కాశం వచ్చింది. ఓటు వేయబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఐదేళ్లగా ప్రజలు అభద్రతా భావనలో ఉన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, ఉపాధి కోసం వలసలను నివారించే నేతకే నేను ఓటేస్తా.

- కీలుకుప్ప శ్రీజ, బీఎస్సీ, పెనుబల్లి , బుచ్చిరెడ్డిపాళెం

ప్రజాధనం దోచుకున్న ప్రసన్న

● కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, ఏప్రిల్ 20: ప్రజాధనం దోచుకోవడం తప్ప నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని ప్రసన్నకుమార్‌రెడ్డిని ఉద్దేశించి కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొడవలూరు గ్రామంలో ఆమె శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నార్తురాజుపాలెం గ్రామంలో వార్డు మెంబరు హరిప్రసాద్, ఆయన అనుచరులు సుమారు 300 మందితో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కొడవలూరు గ్రామంలో సుమారు 100 కుటుంబాలు టీడీపీలో చేరారు. అనంతరం ఆమె నారా చంద్రబాబునాయుడు జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం కొడవలూరు రైల్వేగేట్ ప్రాంతం నుంచి ప్రచారం నిర్వహించారు. కొడవలూరు ప్రధాన కూడలి వద్ద ఆమె మాట్లాడుతూ ఓడిపోతామనే భయంతో విమర్శలు, అసత్య ఆరోపణలు చేస్తున్నారని వీటిని ప్రజలు నమ్మబోరన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటేయ్యాలని కోరారు. నియోజకవర్గంలో అరాచక శక్తులను పారదోలాలంటే ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. జిల్లా అభివృద్ధిపథంలో నడవాలంటే ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు కేవీఆర్ విజయ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, ఇరువూరు శ్రీధర్‌రెడ్డి, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, జి శేఖర్‌రెడ్డి, మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కరకటి మల్లికార్జున, మదన్, వెంకటరమణారెడ్డి, శివకుమార్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు భారీగా తరలిన నేతలు



వెంకటాచలం: చంద్రబాబు సభకు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

వెంకటాచలం, ఏప్రిల్ 20: పొదలకూరులో శనివారం మధ్యాహ్నం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభకు సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సారథ్యంలో మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. అన్ని గ్రామాల నుండి ప్రజలు వేలాదిగా తరలినట్లు మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, ఉపాధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

● **మనుబోలు :** మండలంలోని పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో తెలుగు తమ్ముళ్ళు తరలివెళ్ళారు. మండల కేంద్రమైన మనుబోలు నుంచి తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో యువకులు, టీడీపీ శ్రేణులు బస్సుల్లో తరలివెళ్ళారు. రానున్న ఎన్నికల్లో సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని పచ్చిపాల రామిరెడ్డి అన్నారు.

మాజీ వలంటీర్లు టీడీపీలో చేరిక

విడవలూరు : మండల పరిధిలోని రామతీర్థం గ్రామానికి చెందిన మాజీ వలంటీర్లు శూలం, మాధవి, అశోక్, మహేశ్వరిలు శనివారం టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ నాయకులు తాతా రమేష్, ఉప్పాల శీనయ్యల ఆధ్వర్యంలో కోవూరు ఉమ్మడి అభ్యర్థి ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాడా నరేంద్ర, ఉప్పాల వెంకటరమణయ్య, నాసిన రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

ఇందుకూరుపేట : వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి కోరారు. మండలంలోని ముదివర్తిపాలెంలో శనివారం ముందుగా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేసి బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వరదలకు తెగిపోయిన పెన్నానది పొర్లుకట్టలను మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, శ్రీకాగొల్లు నాగరాజు, షైపాటి సుబ్రహ్మణ్యం, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిని గెలిపించాలని ఇంటింటా ప్రచారం

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 20 : మండలంలోని వీలుకానిపల్లి గిరిజన కాలనీలో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెడుతున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ పథకాల వల్ల మహిళలకు ఎంతో మేలు చేకూర్చుతాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్థసారధి నాయుడు, శివయ్యనాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీసాయిప్రియ ఎన్నికల ప్రచారం

సైదాపురం, ఏప్రిల్ 20: మండలంలోని వేములచేడు పంచాయతీలో ఆదివారం వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ఆదివారం ఉదయం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని మండల తెలుగు రైతు అధ్యక్షుడు కేపీ రాజు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రచారం విజయవంతం చేయాలని కోరారు.

వాడవాడలా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు



విడవలూరు : చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

విడవలూరు, ఏప్రిల్ 20: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు మండలంలో శనివారం ఘనంగా జరిగాయి. విడవలూరులోని పార్టీ కార్యాలయంలో మండలపార్టీ అధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఆ పార్టీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, పాశం శ్రీహరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, పొన్నపోలు పురంధర్‌రెడ్డి, సుధాకర్, కామేశ్వరి పాల్గొని కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఊటుకూరులో టీడీపీ నాయకులు రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, సింహాద్రి అయ్యప్ప, రఫీ, ఉచ్చూరు సుదీప్‌రెడ్డిలు కేక్ కట్ చేశారు. దండిగుంట లో టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున, సునీల్, సోమయ్య, రాజ, వెంకస్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

ముత్తుకూరు: స్థానిక హైస్కూల్ సెంటర్ సమీపంలో శనివారం నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఏకొల్లు కోదండయ్య, వైసీఆర్ రమణయ్య తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం 74 కేజీల భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డిని గెలిపించి చంద్ర బాబుకు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంగారి ఎల్లయ్య, కోడూరు రవి, సుధాకర్, ప్రసాద్, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు మండల టీడీపీ కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొండూరు సుధాకర్‌రెడ్డి, బొద్దుకూరు సుధాకర్, బొద్దుకూరు సుధీర్, కృష్ణారెడ్డి, రామచంద్రనాయుడు మునగాల రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

150 మద్యం సీసాల పట్టివేత



వెంకటాచలం: మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు, సిబ్బంది

వెంకటాచలం, ఏప్రిల్ 20: మండలంలోని పూడిపర్తి గ్రామంలో శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (నెల్లూరు సెబ్) ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి 150 మద్యం సీసాలు పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.22,950 రుపాయలు ఉంటుందని సెబ్ ఎస్ మల్లికార్జున్‌రావు తెలిపారు. అధికారులకు అందిన సమాచారం మేరకు గ్రామంలోని బట్టిపాటి గురుప్రసాద్‌కు సంబంధించిన టైలరింగ్ దుకాణంలో రెండు సంచుల్లో మద్యం సీసాలు ఉండగా వాటిని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురుప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో సెబ్ కానిస్టేబుల్స్ జీ వెంకటేశ్వర్లు, జే కోటేశ్వరరావు, పీవీ సుబ్బయ్య, బీ హరనాథ్ పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్స్ షాపులో..



సైదాపురం: : మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

సైదాపురం: మండలకేంద్రంలోని రాపూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కూల్ డ్రింక్స్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకాలు చేస్తున్న 20మద్యం సీసాలను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వజయ్‌కుమార్ మాట్లాడారు. చల్లా ప్రసాద్ అనే యువకుడు కూల్‌డ్రింక్స్ షాపులో అమ్మకాలు చేస్తున్న సమయంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

సర్వేపల్లిలో నామినేషన్లు నిల్

వెంకటాచలం, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల పర్వం ప్రారంభమై మూడు రోజులు అవుతున్నా సర్వేపల్లి నియోజకవర్గానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, శనివారం కూడా ఎవరూ నామినేషన్లు వేయలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు సోమవారం నుండి నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.

కోవూరు సర్వేపల్లి

చంద్రబాబునాయుడి సమక్షంలో సొంతగూటికి ఈదూరు, మునుకూరు



ఈదూరును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

ముత్తుకూరు, ఏప్రిల్ 20: ముత్తుకూరు మండలానికి చెందిన కీలక నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి శనివారం చంద్రబాబు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పొదలకూరులో జరిగిన ప్రజాగళం సభలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు వీరిద్దరితో పాటు కృష్ణపట్నం మాజీ ఎంపీటీసీ కారంచేటి ప్రసాద్‌శర్మకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో టీడీపీని వీడి వైసీపీలో చేరిన గొలగమూడి ఆశ్రమ కమిటీ సభ్యుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, నెల్లూరు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మునుకూరు రవికుమార్‌రెడ్డి అప్పట్లో కాకాణి విజయంలో కీలక పాత్ర పోషించారు. వీరిద్దరూ తిరిగి సొంతగూటికి చేరడంతో మండలంలో టీడీపీ మరింత బలం పుంజుకుంది. ఈదూరు, మునుకూరుల చేరికతో మండలంలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి.

కోల్డ్ స్టోరేజ్ నిర్మించాలి

● చంద్రబాబుకు నిమ్మరైతుల గోడు

పొదలకూరు, ఏప్రిల్ 20 : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో నిమ్మ రైతుల కోసం పొదలకూరులో కోల్డ్ స్టోరేజ్‌ని నిర్మించడంతోపాటు నిమ్మ ఆధారిత పరిశ్రమలు తీసుకొస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని మండల నిమ్మరైతులు చంద్రబాబునాయుడుకి విన్నవించారు. రానున్న ఎన్నికల్లో తమరు అధికారంలోకి రావడం ఖాయమని, తమ చేతుల మీదుగా కోల్డ్ స్టోరేజ్ నిర్మించి, నిమ్మ ఆధారిత పరిశ్రమలను తీసుకురావాలని, మండలంలోని నిమ్మరైతులు చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. మర్రిపల్లి హెలీప్యాడ్ నుంచి వస్తున్న చంద్రబాబును ఆయన్ను నిమ్మ రైతులు ఆపి ట్రైలలోని నిమ్మకాయలను తీసుకెళ్లి చూపించి, తమరు ఇచ్చిన కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ వల్లే నిమ్మ రైతులు నిమ్మకాయలు పండించుకుంటున్నామని, 25వేల ఎకరాలు కండలేరు కింద సాగులోకి వచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. జగన్, మంత్రి కాకాణి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని, తమరి చేతుల మీదుగా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం జరిపించాలని ఆకాంక్షించారు. చంద్రబాబు నిమ్మరైతులకు వారి కోరికను తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు (డక్కిలి), ఏప్రిల్ 20: పెంచలకోన నృసింహస్వామి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వేకువజామున అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. 10-30 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించారు. కాగా, ఉత్సవాల సందర్భంగా 2024 వార్షిక బ్రహ్మోత్సవాల తాత్కాలిక అంగళ్ల బహిరంగ వేలం నిర్వహించారు. అందులో 56 ప్లాట్లుకు 27 ప్లాట్లను పాటదారులు దక్కించుకున్నారు. ఈ వేలంతో ఆలయానికి రూ.17,55,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు.

వైభవంగా హనుమంత సేవ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 20: పెద్దూరులోని సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి హనుమంతు సేవలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళికృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. రాత్రి స్థానిక కల్యాణ వేంకటేశ్వర కోలాట బృందం, శ్రీ వాసవి భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం భక్తులను అలరించింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు గరుడ సేవలో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కామాక్షితాయి సేవలో కేంద్ర ఎన్నికల అధికారి

జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని కేంద్ర ఎన్నికల అధికారి కంచన్ రాం మీనా శనివారం దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పవర్‌గ్రిడ్ లైన్ల కింద మంటలు వేయొద్దు

మనుబోలు, ఏప్రిల్ 20: పవర్ గ్రిడ్ లైన్ల కింద చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను వేసి తగులపెట్టడం, మంటలు వేయడం వంటివి చేయరాదని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న 400 కేవీ, 765 కేవీ పవర్‌గ్రిడ్‌ల నుంచి విజయవాడ-నెల్లూరు 1,2,3,4, నెల్లూరు-చెన్నై, నెల్లూరు-కర్నూలు, నెల్లూరు-గుత్తి, లైన్లు జిల్లాలోని మనుబోలు, గూడూరు, వెంకటగిరి, ముత్తుకూరు, పొదలకూరు, ఆత్మకూరు, వింజమూరు మండలాల్లో వెళుతున్నాయి. విద్యుత్ లైన్ల కింద మంటపెడితే సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. కావున రైతులు, ప్రజలు పవర్‌గ్రిడ్ కార్పోరేషన్‌కు సహకరించాలని కోరారు.

డిమాండ్ల సాధకులకే 'హంస'లో చోటు



ఏపీ హంస అసోసియేషన్ బుచ్చి తాలూకా కార్యవర్గం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 20: ఏపీ హంస అసోసియేషన్ కార్యవర్గంలో నిజాయితీపరులు, ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం పనిచేసేవారికి మాత్రమే అవకాశం కల్పించినట్లు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో హంస జిల్లా అధ్యక్షుడు, జిల్లా జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ బుచ్చి తాలూకా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు ఆర్ ఇందిర, గౌరవ సలహాదారులు పరిమళ, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు ఎస్కే జలీల్ అహ్మద్, కప్పా నారాయణరాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్య ఆరోగ్య శాఖలో వైద్య సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీహెచ్‌సీ డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ పద్మజ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న అయ్యగారిపాలెం సర్పంచి దంపతులు

టీడీపీలోకి వైసీపీ కీలక నేతలు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. శనివారం పొదలకూరులో జరిగిన సభలో చంద్రబాబు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే ఈదూరు రామకృష్ణారెడ్డి సోదరుడు సీనియర్ నాయకుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి (బాబిరెడ్డి), ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైటెడ్ ఫోరం ప్రెసిడెంట్ డేగా రవిరాఘవేంద్ర, పొదలకూరు మండలం విరువూరు సర్పంచ్ డేగా జగన్‌మోహన్, అయ్యగారిపాలెం సర్పంచ్ కండే వసంతమ్మ, కండే నరసయ్య, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనగట్ల రఘురామ్ ముదిరాజ్, వైసీపీ విద్యార్థి విభాగ రాష్ట్ర నేత సర్వేపల్లి విశ్వరూపాచారి, ముత్తుకూరు మండలం కృష్ణపట్నం మాజీ ఎంపీటీసీ సభ్యుడు కారంచేటి ప్రసాద్‌శర్మ, బుడంగుంట రామకృష్ణారెడ్డి, ఇనుకుర్తి వైసీపీ నేత నోటి శ్రీనివాసులురెడ్డి, రాపూరి శేషయ్య నాయుడు, బత్తల హరిందర్‌రెడ్డి, గోపిరెడ్డి మల్లికార్జున, తాళ్లపరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నెం రాముగౌడ్‌తో పాటు వారి అనుచరులున్నారు. మంత్రి కాకాణి సొంతూరు తోడేరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లోని అయ్యగారిపాలెం సర్పంచ్ కండే వసంతమ్మ, కండే నరసయ్యతో పాటు వైసీపీకి కోటగా చెప్పుకునే విరువూరు సర్పంచ్ కూడా టీడీపీలోకి రావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఏసీబీ వలలో తూ.కొ ఇన్‌స్పెక్టర్

● వెరిఫికేషన్ సర్టిఫికెట్‌కు లంచం తీసుకుంటుండగా పట్టివేత



లంచం తీసుకున్న అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 20: తూనికలు, కొలతల యంత్రాలకు వార్షిక ధ్రువపత్రాలు జారీ చేయాలంటే లంచం డిమాండ్ చేశాడు ఆశాఖ ఇన్‌స్పెక్టర్. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కాగా ఆ అధికారి శనివారం లంచం తీసుకుంటుండగా వారు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, నెల్లూరు నగరానికి చెందిన ఎం. వెంకటపతికి పలు ఏజెన్సీలు ఉన్నాయి. ప్రతీ ఏటా ఆయనకు సంబంధించిన తూనికలు, కొలతల యంత్రాలను తూ.కొ అధికారులు పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేస్తుంటారు. దాంతో పాటు ఆయన స్టాంప్ డ్యూటీ చెల్లిస్తుంటాడు. ఈ క్రమంలో వెంకటపతి తన యంత్రాలను పరిశీలించాలని, ధ్రువపత్రాలు జారీ చేయాలని తూ.కొ అధికారులను సంప్రదించారు. ధ్రువపత్రాలను జారీచేయాలంటే అధిక మొత్తంలో నగదును లంచంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో నెల్లూరు ఏసీబీ డీఎస్పీ శిరీషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ అంజనేయరెడ్డి, సిబ్బంది శనివారం తూనికలు కొలతల కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకర్ బాధితుడి నుంచి నగదు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి ఏసీబీ అధికారులు రూ.38,150 నగదును స్వాధీనం చేసుకుని, ఈ మేరకు కేసు నమోదు చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయా... లేదా ? అని అధికారులు, సిబ్బంది పాత్రపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

రెండు లారీల ఢీ : డ్రైవర్ మృతి



ప్రమాదానికి గురైన లారీ

మర్రిపాడు, ఏప్రిల్ 20: నందవరం సమీపంలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై శనివారం ఉదయం రెండు లారీలు ఎదురెదురు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బొగ్గు లారీ డ్రైవర్ ఓబుల్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కడప వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ, నెల్లూరు వైపు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న లారీ ఎదురెదురు ఢీ కొన్నాయి. కోళ్ల వ్యర్థాలతో వెళ్తున్న లారీ రోడ్డుకు అడ్డంగా పడిపోవటంతో వ్యర్థాలు రోడ్డుపై చల్లా చదురు పడిపోయాయి. దారిన వెళ్లే ప్రయాణికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

● దుర్వాసనతో గుర్తించిన రైల్వే అధికారులు

కావలి రూరల్, ఏప్రిల్ 20: కావలి పట్టణంలోని వడ్డిపాలెం సమీపంలో ఉన్న పాడుబడ్డ రైల్వే క్వార్టర్స్‌లో సుమారు 60 ఏళ్ల వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. శనివారం ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుండడంతో రైల్వే అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1వ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. పాడుబడిన రైల్వే క్వార్టర్స్ నుంచి దుర్వాసన రావటాన్ని పసిగట్టిన ఇంజనీరింగ్ డిపార్టు మెంట్‌కు చెందిన రొట్టె నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శిథిలావస్థలో ఉన్న భవనాల్లో పరిశీలించగా మృతదేహం ఉంది. అయితే మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు గోధుమ రంగు ప్యాంటు, లైట్ గ్రీన్ కలర్ పై పింకు, నలుపు గీతల పొడవు చేతుల చొక్కా ధరించి బట్టతలతో ఉన్నాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

314 మద్యం సీసాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20 : మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలపై పోలీసు, సెబ్ అధికారులు శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు దాడులు నిర్వహించి 314 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సైదాపురం పోలీసు స్టేషన్ పరిధిలో 20, కృష్ణాపట్నంలో 9, కొండాపురంలో 15, సంగంలో 11, దుత్తలూరులో 7, జలదంకిలో 25, చేజర్లలో 10, సెబ్ అధికారులు 217 మొత్తం అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను సీజ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి తీవ్ర గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 20 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చెముడుగుంట వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు అనికేపల్లి గ్రామానికి చెందిన కాకి నిరంజన్ మోటారుబైక్‌పై నెల్లూరుకు వెళ్లి తిరిగి అనికేపల్లికి వస్తుండగా చెముడుగుంట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని నిరంజన్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	141
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 7015
వెండి కిలో ధర	రూ. 86,100
వెండి ఒక గ్రాము	రూ. 88.10

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

ఎన్నికల పర్వం

సిటీకి ఒక నామినేషన్

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 20 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నెల్లూరు సిటీ నియోజకవర్గానికి శనివారం ఒక నామినేషన్ దాఖలైంది. సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన అభ్యర్థి అమీర్ అహ్మద్ షేక్ నెల్లూరు సిటీ నుంచి పోటీ చేస్తున్నట్లు పత్రాలను రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్‌కు అందచేశారు. నగరంలోని జెండావీధి నుంచి ర్యాలీగా వచ్చి ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు.

ఓటర్ల చైతన్యానికి కరపత్రాలు



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 20 : ఏ ట్రస్ట్ ఏ ఫర్ ఆల్ సంస్థ ఓటర్ల చైతన్యం కోసం శనివారం స్వతంత్ర పార్కులో కరపత్రాలు విడుదల చేసింది. పోలింగ్ బూత్‌లో ఓటు దేశాభివృద్ధికి దోహదపడుతుందని, ఓటు హక్కు ఉన్నవారు ఆ హక్కును వినియోగించుకోవాలని సంస్థ ప్రతినిధులు అళహరి వెంకటేష్, చంద్రశేఖర్, రమణ, సుధాకర్ కోరారు. ప్రస్తుత ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం రూ.15వేల కోట్లు ఖర్చు చేస్తోంద ని, కానీ తొలి విడతలో పోలింగ్ 62.7 శాతమే కావడం విచారకరమన్నారు.

కొండా వెంకయ్యకు మద్దతు : ఏపీ ఎంఆర్‌పీఎస్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 20 : కోవూరు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉన్నత విద్యావంతుడు కొండా వెంకయ్యకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఏపీ ఎంఆర్‌పీఎస్, దళిత సంఘర్షణ సమితి నాయకులు చెప్పారు. నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ప్రచారం చేసి కొండా వెంకయ్యను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కొండా వెంకయ్య మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యేసపోగు బాబు, కృష్ణయ్య, దళిత సంఘర్షణ సమితి నాయకులు పాలెపు తిరుపాలు, పాపారావు, విద్యార్థి సంఘం నాయకులు రాము, ఉదయ్, వెంటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్, పోలీసు స్టేషన్ల తనిఖీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ శనివారం నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్, చిన్నబజారు, నవాబుపేట పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నేర నియంత్రణకు నగరాన్ని మూడు సెక్టార్లుగా విభజించామని, గస్తీని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రంలోకి వెళ్లి వచ్చే ద్వారాల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, సరైన అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్‌ఎస్ఆర్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మౌలిక సదుపాయాల గురించి వివరించారు. రైల్వే స్టేషన్, రైళ్లలో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు, మద్యం అక్రమ రవాణా జరగకుండా అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ పోలీసులను ఆదేశించారు. ఈ తనిఖీలో చిన్నబజారు, నవాబుపేట ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, బాబి పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

అభివృద్ధి చేసి చూపిస్తా...!

● ప్రచారంలో టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 20 : అభివృద్ధి ఎలా ఉంటుందో గతంలో ఎవరూ అడగకుండానే చేశానని, ఇప్పుడు ప్రజలందరికీ చెప్పి మరీ అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 48వ డివిజన్‌లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కారణంగానే ప్రస్తుతం ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారన్నారు. తమకు మంచి రోజులు రాబోతున్నాయన్న నమ్మకం వారిలో కలగడంతో తమను అందరూ ఆదరిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దుష్టపాలన తప్ప అభివృద్ధి అన్న పదానికే వారికి అర్థం తెలియదన్నారు. టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులన్నీ వేగవంతంగా పూర్తి చేస్తామని, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

● 5వ డివిజన్‌లో నారాయణ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్ తనకు ఎన్నో సవాళ్లు, చాలెంజ్‌లు విసిరారని, అవన్నీ కేవలం టీవీలు, పేపర్లకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇప్పటికే వాస్తవాలు తెలుసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ కుమార్తె సింధూర, కూటమి నేతలు పాల్గొన్నారు.

● నారాయణ సమక్షంలో పలువురు వలంటీర్లు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నగరంలోని గోమతినగర్‌లో ఉన్న నారాయణ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతోపాటు వారికి గౌరవ వేతనం పెంచుతామని ఈ సందర్భంగా నారాయణ హామీ ఇచ్చారు.



ఎన్నికల ప్రచారంలో ఓ ఇంటిలో విజయ చిహ్నం చూపుతున్న నారాయణ, రమాదేవి దంపతులు

చంద్రబాబు సీఎం అయిన వెంటనే మెగా డీఎస్సీ

● ప్రైవేట్ స్కూల్ టీచర్ల ఆత్మీయ సమావేశంలో రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 20 : చంద్రబాబు ఏపీ సీఎంగా బాధ్యతలు తీసుకున్న వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తారని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్ టీచర్లు, కరస్పాండెంట్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నవ సమాజ నిర్మాణ బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మేధావు లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆలోచించి పిల్లల భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించాలని కోరారు.

రూరల్లో వైసీపీకి భారీ షాక్

నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు, పార్టీ ఆమంచర్ల గ్రామ ఇన్‌చార్జి గేనేడి వెంకటేశ్వర్లు నాయుడు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం పొదలకూరుకు వచ్చిన నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆయన కోటంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కాగా, నగరంలోని 23వ డివిజన్‌కు చెందిన వైసీపీ నేత కోటంరెడ్డి సుధీష్ రెడ్డి టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల్లో తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరుతానని ప్రకటించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లు నాయుడును చంద్రబాబుకు పరిచయం చేస్తున్న కోటంరెడ్డి

పార్టీ మారగానే దెయ్యం దేవతలా కనిపిస్తోందా?

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని క్రైం కేపిటల్‌గా మారుస్తోందని ఎన్నోసార్లు విమర్శించిన చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డికి జనసేన పార్టీ నుంచి వైసీపీ లోకి మారగానే దెయ్యం దేవతలా కనిపిస్తోందని జనసేన నాయకులు విమర్శించారు. నగరంలోని సుబేదారు పేటలో గల జనసేన కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా ప్రధాన కార్యద ర్శి గునుకుల కిషోర్, చిరంజీవి యువత నాయకులు విలేకరు లతో మాట్లాడారు. జనసేనలో టిక్కెట్ రాలేదని ఆత్రంతో వైసీ పీలోకి వెళ్లారా.. లేక ఏమైనా తీర్థం పుచ్చుకున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కారంపూడి కృష్ణారె డ్డి, ఏటూరు రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శర్మ, గుర్రం కిషోర్, ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరుకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబును స్వాగతం పలుకుతున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్

పసికందులకు రక్షణ లేదా..!?

● జీజీహెచ్‌లో ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థకు నాలుగేళ్ల క్రితమే మంగళం

● వైసీపీ ప్రభుత్వ తీరుపై విమర్శల వెల్లువ

నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో గల ప్రసూతి విభాగానికి ప్రతినెల 300 నుంచి 350 మంది వరకు గర్భవతులు ప్రసవాలకు వస్తుంటారు. వీరుకాక తీవ్ర అనారోగ్యంతో బాధపడే చిన్నారులకూ ఇక్కడ వైద్య సేవలు అందిస్తుంటారు. ఈ క్రమంలో పురిటి పిల్లలు, చిన్నారుల రక్షణకు పటిష్ట చర్యలు, నిఘా వ్యవస్థ ఉండాలి. అయితే జీజీహెచ్‌లో ఆ వ్యవస్థకు వైసీపీ ప్రభుత్వం మంగళం పాడేసింది. ఇక్కడి అత్యాధునిక ఆర్ఎఫ్ఐడీ పరికరం నాలుగేళ్లుగా పనిచేయకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ట్యాగులు ఉన్న చిన్నారి, తల్లి (ఫైల్)



పనిచేయని ఆర్ఎఫ్ఐడీ సెన్సార్ పరికరం

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 20 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ప్రసూతి, చిన్నపిల్లల విభాగంలో చిన్నారుల రక్షణ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. టీడీపీ ప్రభుత్వంలో ఎంతో నైపుణ్యంతో ఏర్పాటు చేసిన రేడియా ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) పరికరం గత నాలుగేళ్లుగా పనిచేయక నిర్వీర్యంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పురిటి పిల్లలు మాయమవుతున్నారు. నెల్లూరు జీజీహెచ్‌లోనూ 2018వ సంవత్సరంలో ఓ చిన్నారిని మహిళ ఎత్తుకుపోయింది. అప్పట్లో ఆర్ఎఫ్ఐడీ పరికరం ద్వారా పోలీసులు సదరు మహిళను పట్టుకుని పురిటి బిడ్డను తల్లి చెంతకు చేర్చిన విషయం విదితమే. అయితే ప్రభుత్వ ఆసుపత్రులను సంస్కరిస్తున్నానని ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రక్షణ వ్యవస్థను మాత్రం పట్టించుకోలేదు. దీంతో పురిటి పిల్లల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

టీడీపీ ప్రభుత్వంలోనే శ్రీకారం

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో పిల్లలపై నిఘా ఉంచేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆర్ఎఫ్ఐడీ పరికరం ఏర్పాటు చేసింది. తల్లికి, పురిటి పిల్లల కాలికి, చేతికి ట్యాగ్ వేసేవారు. ఎవరైనా పురిటి పిల్లలతో బైటకు వెళితే ట్యాగులకు అనుసంధానం చేసిన మానిటర్ ద్వారా సైరన్ మోగుతుంది. దీంతో అక్కడ ఉన్న సెక్యూరిటీ ఆ పిల్లలను రక్షించటం జరుగుతుంది. ఈ ప్రసూతి ఆసుపత్రిలో నాలుగేళ్ల క్రితం ఈ ఆర్ఎఫ్ఐడీ పరికరం మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పురుటి పిల్లల రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది.

ప్రభుత్వ చర్యలు సరిలేవు



టీడీపీ ప్రభుత్వంలో ప్రసూతి విభాగంలో పురిటి పిల్లల రక్షణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిఘా పరికరం సంరక్షణను గాలికి వదిలేసింది. గతంలో పిల్లలను ఎత్తుకుపోయిన సంఘటనలు ఉన్నా వాటి నుంచి గుణపాఠం నేర్చుకున్నట్లు ప్రభుత్వ చర్యలు లేవు.

\- సతీష్‌కుమార్, యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు

వైభవంగా అంకురార్పణ

● శబరి శ్రీరామక్షేత్రంలో బ్రహ్మోత్సవాల ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 20 : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ వైభవంగా జరిగింది. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, మాతృకాపూజ, హోమం జరిగాయి. అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. గురుదత్త కళానిలయం చిన్నారుల నృత్య కదంబం అలరించింది.

● మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో ఉదయం సూర్యప్రభ వాహనంలో నగరోత్సవం జరిగింది. సాయంత్రం విశేష పూలంగి సేవ, ప్రత్యేక పూజల అనంతరం హంస వాహనంపై పేట ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పంగున్యోత్తర కల్యాణోత్సవాల్లో 4వరోజు తిరుమంజనం, స్థలపురాణ పారాయణం, రాత్రి రంగనాథ స్వామికి, రంగనాయకమ్మకి ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవ జరిగాయి.

● వేదాయపాళెం త్యాగరాజస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. ఉదయం తిరుమంజనం, అభిషేకాలు, ఊంజల్‌సేవ, సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం జరిగాయి. సాయంత్రం త్యాగరాజ మహిళా మండలి కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

● ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో ఉదయం సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి హంస వాహనంపై పేట ఉత్సవం నిర్వహించారు.

● సంతపేట ఆంజనేయ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో ఉదయం అభిషేకం, విశేష పూజలు, పూలంగిసేవ, జరిగాయి. సాయంత్రం జింక వాహన సేవ జరిగింది.



హంసపై వేణుగోపాలుడు



శబరి క్షేత్రంలో మాతృకా పూజ

వేదగిరిపై చైత్ర మాస, వసంతోత్సవం

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 20 : వేదగిరి క్షేత్రంలో శనివారం చైత్ర మాసోత్సవం, వసంతోత్సవం జరిగాయి. లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పల్లకి సేవ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షించారు.

నవబాల దుర్గా ఆలయ సమీపంలో వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 20 : నెల్లూరు - జొన్నవాడ రహదారి వెంబడి నవబాలదుర్గాదేవి ఆలయ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని నెల్లూరు రూరల్ పోలీసులు గుర్తించారు. సీఐ మారుతీకృష్ణ అందించిన వివరాల మేరకు... బుచ్చి మండలం నక్కలగోళ్ల గ్రామానికి చెందిన దాసరి రాము (56) శుక్రవారం నెల్లూరులోని మూలపేట వద్దనున్న తన కుమార్తె ఇంటికి వచ్చాడు. వంటకు చేపలు తెస్తానని వెళ్లిన అతను సాయంత్రమైన రాకపోవడంతో ఆయన కుమార్తె రమ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాము సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నవబాలదుర్గాదేవి ఆలయ సమీపాన రైస్‌మిల్లు వద్ద మృతదేహాన్ని గుర్తించామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించా రు. గుండెపోటుతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

రేపటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్ష

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 20 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి ఈనెల 22 నుంచి 25వతేదీ వరకు డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్య ర్ గ్రేడ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షలకు హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డుతో హాజరు కావాలని తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



ఆత్మకూరు, ఏప్రిల్ 20: పట్టణంలోని ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్ టీ శ్రీనివాసులురెడ్డికి ఎస్వీయూ అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. 'నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండల గ్రామీణ సమాచార అవసరాలు- సమాచారం పొందే విధానాలు' అనే అంశంపై ఆయన పరిశోధన పత్రం సమర్పించినందుకు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం అధికారులు పీహెచ్‌డీ అందచేశారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం గ్రంథాలయ, సమాచార శాస్త్రం రిటైర్డ్ ప్రొఫెసర్ వీ పుల్లారెడ్డి ఆయన ప్రాజెక్టుకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. డాక్టరేట్ సాధించిన శ్రీనివాసులురెడ్డిని శనివారం కళాశాల కరస్పాండెంట్ ఎస్ రాధాకృష్ణయ్య, ప్రిన్సిపాల్ జీ వరలక్ష్మి, పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పోలీసుల అదుపులో దోపిడీ కేసు నిందితులు?

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20: మెమూ రైలులో జరిగిన దోపిడీ కేసులో రైల్వే పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున చెన్నై వెళుతున్న మెమూ రైలులో పడుగుపాడు వద్ద కోవూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఎక్కారు. కొండూరుసత్రం వద్ద వారు ప్రయాణికులపై దాడి చేసి సెల్ ఫోన్లు, నగదు దోచుకుని రైలుదిగి పరారయ్యారు. జాతీయ రహదారిపై లారీడ్రైవర్ల మీద దాడికి యత్నిస్తుండగా సమాచారం అందుకున్న రైల్వే, మనుబోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు యత్నించగా ఇద్దరు పరారయ్యారు. కోవూరు ఇనమడుగు సెంటర్‌కు చెందిన సాగర్ చిక్కడంతో అతనిని తమదైన శైలిలో విచారించగా మిగిలినవారి వివరాలు తెలిపాడు. దీంతో వారిని కూడా రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

దివ్యాంగులకు పండ్లు, బిస్కెట్ల పంపిణీ

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 20 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు టీడీపీ నాయకులు పండ్లు, బిస్కట్లు పంచిపెట్టారు. చంద్రబాబు సేన జిల్లా అధ్యక్షుడు గుమ్మడిపూడి కల్యాణ్ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీప్రసాద్, వేలూరు రాజు, దుష్యంత్, అనిల్, చిరంజీవి, కృష్ణ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

'రత్నం' విద్యార్థులకు ఆర్ఐవో అభినందన

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 20 : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన డాక్టర్ కిషోర్స్ రత్నం జూనియర్ కళాశాల విద్యార్థినులు జాహ్నవి, శుశ్రుతను ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు అభినందించారు. నగరంలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఐవో మాట్లాడుతూ కళాశాల ప్రారంభించిన తొలి ఏడాదిలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. బైపీసీ విభాగంలో జాహ్నవి 436, శుశ్రుత 433 మార్కులు సాధించినందుకు ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, అకడమిక్ అడ్వైజర్ నరసయ్య నాయుడు, ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, అధ్యాపకుడు హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులతో ఆర్ఐవో శ్రీనివాసులు

ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని ఇంటర్‌బోర్డు కార్యాలయం లో ఆర్ఐవో శ్రీనివాసులకు శనివారం వినతి పత్రం అందచేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రులను వేధిస్తుండడంతోపాటు గుర్తిం పులేని కళాశాలల్లో పిల్లలను చేర్పించాలని ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఒక చోట కళాశాలకు అనుమతులు తీసుకుని అనేక బ్రాంచ్‌లు ఏర్పాటు చేసిన సంస్థలపై చర్య లు తీసుకోవాలని కోరారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటానని ఆర్ఐవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ షారుఖ్ ఖాన్, నేతలు ఆషిక్, అన్వర్, మస్తాన్, సాయిదేవ్, చందు, నవీన్ పాల్గొన్నారు.

వేమిరెడ్డి, నారాయణను గెలిపించుకుందాం.. : కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 20 : చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసుకుందామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. 14వ డివిజన్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణలను అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు జన్మదిన కానుక ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. మంత్రిగా నారాయణ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క అభివృద్ధి కూడా జరగలేదని విమర్శించారు. విశాఖను ఊడ్చేసిన విజయసాయిరెడ్డి నెల్లూరును నిలువు దోపిడీ చేస్తాడని ప్రజలు ఆలోచించాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, మల్లికార్జున, బాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్లు కూల్చేశారు : కేతంరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 20: వైసీపీ ప్రభుత్వంలో ప్రత్యామ్నాయం చూపకుండా పేదల చేతికి డమ్మీ పట్టాలిచ్చి అనేక మంది ఇళ్లు కూలదోశారని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి విమర్శించారు. మళ్లీ అదే ప్రభుత్వం వస్తే కూల్చడానికి సిద్ధంగా అనేక ఇళ్లను ఇప్పటికే గుర్తించి నోటీసులు కూడా ఇచ్చి ఉన్నారని ఆరోపించారు. నగరంలోని 45వ డివిజన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పొంగూరు నారాయణకు మద్దతుగా శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వినోద్ మాట్లాడుతూ రానున్న కూటమి ప్రభుత్వంలో ప్రత్యామ్నాయం చూపకుండా పేదవాడి ఇంటిని తొలగించే ప్రసక్తే లేదన్నారు.



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న వినోద్‌రెడ్డి

నువ్వు ఎవరైతే నాకేంటి...? డోంట్‌కేర్ !

డిప్యూటీ కలెక్టర్‌పై ఇరిగేషన్ ఏఈ చిందులు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 20 : 'నేనింతే... ఇలానే ఉంటా.... ఏం చేస్తావో చేసుకో.. నువ్వు నోడల్ అధికారివి అయితే నాకేంటి..? డోంట్‌కేర్... అంటూ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిపై ఇరిగేషన్ ఏఈ ఒకరు చిందులేశారు.ఈ ఘటన శనివారం నెల్లూరు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు, ఇరిగేషన్ (సోమశిల ప్రాజెక్టు)లో ఏఈగా పని చేస్తున్న ఓ అధికారితోపాటు మరో ఇద్దరు పోలీసులను నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించిన సీ విజిల్ యాప్ ఫ్లయింగ్ స్క్వాడ్ విధులు కేటాయించారు. యాప్ ద్వారా కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించడంలో వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కంట్రోల్ సెంటర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ కలెక్టర్‌కు సమాచారం అందింది. ఆయన వారిని పిలిచి విచారించగా ఏఈ పైవిధంగా స్పందించినట్లు తెలిసింది. ఈ విషయమై సిటీ ఆర్వో వికాస్‌మర్మత్ సమాచారం తెప్పించుకుని శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



చంద్రబాబుతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన మహిళలు

గూడూరులో టీడీపీ నాయకులతో కలిసి బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న చంద్రబాబు

గూడూరును నెల్లూరులో చేరుస్తా

- మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు హామీ



గూడూరు, ఏప్రిల్ 20 : ఈసారి అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతానని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు.గూడూరు పట్టణంలోని సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో శనివారం ఉదయం ఆయన మహిళలతో ముఖాముఖి నిర్వహించారు.తొలుత చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.చంద్రబాబు సభాస్థలికి రాగానే హ్యాపీ బర్త్‌డే అంటూ పెద్దఎత్తున అందరూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన చంద్రబాబుకు వారంతా శుభాకాంక్షలు తెలిపారు.అక్కడే నిర్వహించిన రక్తదాన శిబిరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మహిళల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా వుందన్నారు. మహిళలకు మొదటిసారి 8శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఆడబిడ్డలను ప్రపంచంలో తిరుగులేని శక్తిగా మార్చేందుకు తానూ కృషి చేస్తానన్నారు. మహిళల కోసం మద్యనిషేధాన్ని అమలుపరుస్తానని హామీ ఇచ్చిన జగన్ నాసిరకం మద్యం విక్రయిస్తూ ఎంతోమంది మరణాలకు కారణమవుతున్నాడన్నారు.బటన్ నొక్కి అందినకాడికి నొక్కేస్తున్నాడని విమర్శించారు.ఆయన జగన్మోహన్‌రెడ్డి కాదని జే గన్‌రెడ్డి, మోసపురెడ్డి, జలగరెడ్డి అని ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల్లో ఓటరు చేతికి రెండు బటన్లు వస్తాయని అందులో బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కు ఒకటి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌కు మరొకటి నొక్కి జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. చిల్లకూరులో సిలికాను, సూళ్లూరుపేట నియోజకవర్గంలో స్వర్ణముఖి నది నుంచి ఇసుకను వైసీపీ నాయకులు అక్రమంగా దోచుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సిలికా, ఇసుక అక్రమ రవాణాను నియంత్రించి సహజసంపదను భావితరాలకు అందించే బాధ్యత తీసుకుంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థులు పాశం సునీల్‌కుమార్, వరప్రసాద రావు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ,సూళ్లూరుపేట అభ్యర్థిని నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, పరసారత్నం, నెలవల సుబ్రమణ్యం,నాయకులు నరసింహయాదవ్, వాకాటి నారాయణరెడ్డి, పనబాక కృష్ణయ్య, శీలం కిరణ్‌కుమార్, తానంకి నానాజి, జనసేన కో ఆర్డినేటర్ తీగల చంద్రశేఖర్, బీజేపీ నాయకుడు పాపా పురుషోత్తంరెడ్డి, సీబీఎన్ ఫోరం నాయకురాలు సునీత, సంధ్యారాణి, చక్రల ఉష తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి నామకరణం

మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు ఓ చిన్నారికి నామకరణం చేశారు.గూడూరు మండలం చెన్నూరుకు చెందిన సాయిప్రియ చంద్రబాబు అభిమాని. 20 రోజుల క్రితం ఆమె ఓ పాపకు జన్మనిచ్చింది. చంద్రబాబు గూడూరుకు రావడంతో తన కుమార్తెకు పేరుపెట్టాలని చంద్రబాబును కోరింది.చంద్రబాబు సభాస్థలి మీదకు ఆమెను పిలిపించి చిన్నారిని ఎత్తుకుని హాసిని అని నామకరణం చేశారు.

సత్యవేడుపై పెద్దిరెడ్డి పెత్తనమేంటి?

- టీడీపీ అధినేత సూటి ప్రశ్న



సత్యవేడు, ఏప్రిల్ 20: 'నీది ఏ ఊరు పెద్దిరెడ్డీ? సత్యవేడుపై నీ పెత్తనమేంటి? సత్యవేడు నుంచి రోజుకు 200 టిప్పర్ల గ్రావెల్, ఇసుక చెన్నైకు తరలించింది నిజం కాదా? సురుటుపల్లి దగ్గర నేనే చూశా. ఆకాశమే హద్దుగా దోపిడీ చేశారు ' అంటూ చంద్రబాబు ధ్వజమెత్తారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి సత్యవేడు క్లాక్ టవర్ వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.' ఎక్కడో పుంగనూరులో ఉండే పెద్దిరెడ్డి సత్యవేడులోని ఇసుక, మట్టిని చెన్నైలో అమ్ముకుంటాడు. ప్రశ్నించిన ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఈసారి పనికిరావన్నారు. ఇదేం పద్ధతి' అంటూ ప్రశ్నించారు. 'సత్యవేడుకు సమీపంలోనే నేషనల్ హైవే, శ్రీసిటీ ఉంది.ఇది పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ప్రత్యేక ప్రణాళికతో సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాలను ఆదునిక నగరాలకు దీటుగా తీర్చిదిద్దుతా.సత్యవేడును జిల్లాలోనే నెంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తా. ఆ బాద్యత నాదీ' అని భరోసా ఇచ్చారు. సత్యవేడు డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించడంతో పాటు ఇక్కడే ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్‌ను ఆధునికీకరిస్తానని, అరుణానదిలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రిస్తానని, నదీ పరివాహక ప్రాంతలో భూగరర్భ జలాల పెంపుకోసం విరివిగా చెక్‌డ్యాంలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. దాసుకుప్పం - సత్యవేడు బైపాస్ రోడ్డు , మతంగీశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. తెలుగు గంగ కాలువకు ఉపకాలువలు నిర్మించి నియోజకవర్గానికి తాగు, సాగు నీరును అందిస్తామన్నారు. సురుటుపల్లె, నారాయణవనం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. శ్రీసిటీలో ప్రస్తుతమున్న 192 పరిశ్రమలకు తోడు మరో 400 పరిశ్రమలు వచ్చేలా చూస్తానన్నారు. హీరో, అపోలో, శ్రీసిటీ పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.'అటవీ భూముల్లో యూకలిప్టస్ చెట్లను కూడా రూ.7వేల విలువ చేసేవి రూ.3వేలకు కొని, రూ 4 వేలు కొట్టేసే సైకో బ్యాచ్ జిల్లాలో తిష్టవేసింది.చివరకు వైసీపీ ఎర్రచందనం స్మగ్లర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే స్థాయికి దిగజారింది' అని చంద్రబాబు విమర్శించా రు.గోదావరి జలాలను సత్యవేడుకు తీసుకొచ్చి ఇక్కడివారి జీవితాలు మారుస్తానన్నారు.

అన్నీ ఆలోచించే ఆదిమూలానికి టికెట్

'వైసీపీ నుంచి వచ్చాడని ఆదిమూలంపై టీడీపీ నాయకులకు అనుమానం ఉండొచ్చు. నేను అన్నీ ఆలోచించా. ఒక దుర్మార్గుడిపై నువ్వెంతంటే నువ్వెంత అని తిరుగుబాటు చేసి, ఎంపీ సీటు ఇస్తానంటే, ఎంపీ టికెట్టూ వద్దు, మీ పార్టీ వద్దని మొహంమీదే చెప్పి వచ్చిన వ్యక్తి ఆదిమూలం.అక్కడే నేను ఆలోచించా.ఒక తిరుగుబాటు నాయకుడు దొరికాడని ఆలోచించే అభ్యర్థిగా ప్రకటించా. ఆదిమూలం నా దగ్గరే పెరిగాడు. టీడీపీలోనే జడ్పీటీసీ, ఫ్లోర్‌లీడర్, ఎస్సీసెల్ అద్యక్షుడిగా పనిచేశాడు. హేమలత, జేడీఆర్ పార్టీ కోసం కష్టపడ్డారు. వారి కష్టాన్ని గుర్తించి సముచిత స్థానం కల్పిస్తాం' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వరప్రసాద్ కూడా వైసీపీలో అవమానాలు భరించలేక తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు.వీరిద్దరినీ ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు.



సత్యవేడు సభలో చంద్రబాబు ప్రసంగం

కురుగొండ్ల రామకృష్ణకే వెంకటగిరి టికెట్



వెంకటగిరి/డక్కిలి, ఏప్రిల్ 20 : వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను వరించింది. టీడీపీ అధిష్ఠానం శనివారం రామకృష్ణకు ఫోన్ చేసి అమరావతికి వచ్చి బీ ఫామ్ తీసుకెళ్లాలని కబురు పెట్టింది.తొలుత మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో టికెట్‌ను ఆయన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియకు కేటాయించిన విషయం తెలిసిందే.ఇప్పటికే వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో టీడీపీలో చేరిపోవడంతో దుర్భేద్యంగా కనిపిస్తున్న తెలుగుదేశం ఇకపై మరింత స్పీడు పెంచనుంది.ఈ సందర్భంగా తన తండ్రి విజయం కోసం యువతను కూడగడతానని లక్ష్మీసాయిప్రియ ప్రకటించారు.నియోజకవర్గంలో తన తండ్రి చేసిన అభివృద్ధిని ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికీ చెప్పుకొంటున్నారని, తాను ఆ విషయాన్ని ప్రచారానికి వెళ్లినప్పుడు గమనించానన్నారు.

సైకో భర్తను భరించలేనంటూ...

- పెళ్లయిన 5 నెలలకే యువతి బలవన్మరణం



ఘటనా స్థలంలో భోరున విలపిస్తున్న కవిత బంధువులు



కవిత (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 : సైకో భర్తను భరించలేనంటూ...పెళ్లయిన 5 నెలలకే ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. వివాహ జీవితంలో తాను అనుభవించిన మానసిక క్షోభను సూసైడ్ నోట్‌లో రాసుకుని మరీ రైలు కింద పడి తనువు చాలించిన ఈ హృదయ విదారక ఘటన ఏర్పేడులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సూసైడ్ నోట్‌లో సమాచారం మేరకు... ఏర్పేడు మండలం అముడూరు గ్రామానికి చెందిన కవిత ఓ సంస్థలో నర్సుగా పనిచేసేది.ఐదు నెలల క్రితం గాజుల మండ్యం ప్రాంతానికి చెందిన బాలాజీ అనే యువకుడితో వివాహం జరిగింది.కొద్ది కాలానికే భార్యాభర్తల మధ్య అనుమానం చిచ్చురేపింది.తన ఫోన్ బిజీ వచ్చినా... ఎప్పుడైనా పనిలో ఉండి ఫోన్ ఎత్తకపోయినా అనుమానంతో తీవ్రంగా వేధించేవాడని కవిత లేఖలో పేర్కొంది.పలు రకాలుగా తనను దారుణంగా బాలాజీ టార్చర్ చేశాడంటూ రాసుకుంది. శనివారం సాయంత్రం అమ్మగారి ఇంటి నుంచి భర్త వద్దకు బయలుదేరిన ఆమె ఏర్పేడులో దిగి రైలు కిందపడి చనిపోయింది. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రవి, ఏఎస్ఐ రమేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సూసైడ్ నోట్ ఆధారంగా సమీపంలోని అముదూరు గ్రామానికి చెందిన కవితగా గుర్తించారు. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని గుండెలు బాదుకున్నారు. తమ బిడ్డ వివాహమైన ఐదు నెలలకే తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయిందంటూ కన్నీటిపర్యంతమయ్యారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మూడో రోజున 19 నామినేషన్లు

- ఎంపీకి ఇద్దరు.. అసెంబ్లీకి 17 మంది

తిరుపతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు శనివారం మొత్తం 19 మంది 20 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థి వరప్రసాద్ తనయుడు నవీన్ గుప్తా బీజేపీ డమ్మీ అభ్యర్థిగా ఒకటి, ఇండిపెండెంటుగా ఒకటి చొప్పున రెండు నామినేషన్లు వేయగా, బీఎస్పీ తరపున రిటైర్డు జడ్జి గుర్రప్ప నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు గానూ వెంకటగిరిలో నామినేషన్లు దాఖలు కాలేదు.శ్రీకాళహస్తిలో వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పోతుగుంట రాజేష్ నాయుడు, వైసీపీ డమ్మీ అభ్యర్థిగా శ్రీవాణి, ఇండిపెండెంట్‌గా తీగల భాస్కర్ నామినేషన్లు వేశారు. తిరుపతిలో సీపీఐ అభ్యర్థి పి.మురళి, జై హిందూస్థాన్ అభ్యర్థి నీలకంఠ, ఇండిపెండెంట్లుగా కృష్ణ చైతన్య, పెంచల ప్రసాద్, భార్గవ్, సోమశేఖర్, నరేష్, బెనర్జీ, సాయిప్రసన్నకుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. సత్యవేడులో మాజీ ఎమ్మెల్యే హేమలత, గూడూరులో బీఎస్పీ అభ్యర్థి ఎ.మల్లికార్జున, సూళ్లూరుపేటలో ఇండిపెండెంట్‌గా బి.లీలామోహన్, చంద్రగిరిలో ఇండిపెండెంట్‌గా శ్రీచరణ్ నామినేషన్లు దాఖలు చేశారు.

పోలింగ్‌కు 469 బస్సుల కేటాయింపు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 20: మే 13వ తేదీన జరిగే పోలింగ్‌కు 469 ఆర్టీసీ బస్సులను కేటాయించారు.ఎన్నికల సామగ్రి,ఉద్యోగులను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి బస్సులను కేటాయించాలని జిల్లా యంత్రాంగం కోరింది. దీంతో నియోజకవర్గాల వారీగా.. గూడూరుకు 31, సూళ్లూరుపేటకు 44, వెంకటగిరికి 44, చంద్రగిరికి 66, తిరుపతికి 34, శ్రీకాళహస్తికి 41, సత్యవేడుకు 36బస్సులను కేటాయించారు. వీటిని నడపడానికి 469 మంది డ్రైవర్లు హాజరవుతున్న కారణంగా వీరందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు.

జీవధార సోమశిల ప్రాజెక్టు జిల్లాకే తలమానికం. సుమారు 8 లక్షల ఎకరాలకు సాగు, పది లక్షల ప్రజానీకానికి తాగు నీరు అందిస్తున్న మహోత్తర జలనిధి అయిన ఈ డ్యాం నేడు సమస్యల సుడిలో చిక్కుకుపోయింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా డ్యాం మనుగడకే ప్రమాదం నెలకొంది. పోటెత్తిన లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని డ్యాం తట్టుకుని నిలబడుతున్నా మరమ్మతులు, నిర్వహణలో మాత్రం పాలక యంత్రాంగం చేతులెత్తేస్తోంది. ప్రకటించిన నిధులు కూడా సరిగ్గా రాకపోవడంతో భవిష్యత్తులో సోమశిల మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తుందని జిల్లావాసులు గగ్గోలు పెడుతున్నారు.

- అనంతసాగరం

- నీటి సామర్థ్యం పెంచినా కానరాని అభివృద్ధి
- పోటెత్తిన వరదలకు దెబ్బతింటున్న నిర్మాణాలు
- మరమ్మతుల్లో చేతులెత్తేస్తున్న వైసీపీ సర్కారు



అడుగంటిన సోమశిల జలాశయం


పాలకులకు పట్టని

జలనిధి!

• సమస్యలు సుడిగుండంలో 'సోమశిల'

పెంచిన నిల్వకు అనుకూలమేనా!?

సోమశిల క్యాచ్‌మెంట్ ఏరియాపై అధికారుల పర్యవేక్షణ కరువయ్యింది. డ్యాం సామర్థ్యం 75 నుంచి 78 టీఎంసీలకు పెంచినా ఎగువ ప్రాంత అభివృద్ధిని మాత్రం విస్మరించారు. ఎగువ నుంచి వచ్చే వరదతో ప్రాజెక్టు చెంతన పూడిక పేరుకొని ఉండవచ్చు. అయితే ఈ విషయంపై యంత్రాంగం అసలు దృష్టి సారించ లేదన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం జలాశయం పూర్తిస్థాయి నిల్వకు అనుకూలంగా ఉందా!? లేదా!? అనే అంశంపై కూడా అనుమానం కలుగుతోంది. ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం డ్యాంలో 8.5 టీఎంసీల నీరు ఉంది. వాస్తవికతో పరిశీలిస్తే అంత నీటి నిల్వ ఉండదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



క్రస్ట్ గేట్ల నుంచి లీకవుతున్న నీరు (ఫైల్)

సోమేశ్వరుడినీ పట్టించుకోలా

2020, 2021 ఏడాదిలో సోమశిలకు ఎగువ నుంచి వచ్చిన వరదలతో జలాశయ ప్రాంగణంలోని ప్రముఖ సోమేశ్వరుడి ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించామని పాలకులు చెబుతున్నా ఆ దిశగా అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవు. చరిత్ర కలిగిన గుడి నేడు దెబ్బతిని ఉండగా భక్తులు తీవ్ర వేదనకు గురవుతున్నారు.

ఆఫ్రాన్ పనులకు మంగళం

రెండేళ్లపాటు సోమశిలకు వచ్చిన వరదతో జలాశయం ముందు కట్టడాలు ధ్వంసమైన సంగతి తెలిసిందే. జలాశయం నిర్మాణంలో అప్రాన్ ప్రాంతం కీలమైన నిర్మాణం కాగా దెబ్బతిన్న నిర్మాణాలు యథాస్థితికి తెచ్చేలా తీసుకొన్న ప్రణాళికలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. అప్రాన్ నిర్మాణం కోసం రూ.99.11 కోట్లు ప్రతిపాదించగా నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాదిన్నరగా మరమ్మతు పనులు జరగలేదు. దీంతో ఆ కట్టడాలు మరింత ప్రమాదభరితంగా మారాయి.



అధ్వానంగా అసంపూర్తిగా నిలిచిన అప్రాన్ పనులు

క్రస్ట్‌గేట్ల వ్యవస్థ అధ్వానం

ప్రాజెక్టుకు అమర్చిన క్రస్ట్‌గేట్ల వ్యవస్థ సరిగా లేదు. ఏటా నీరు వదిలే సమయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పోటెత్తిన వరద తిరిగి తగ్గే వరకు ఇంజనీర్లు ఉత్కంఠకు గురవుతున్న పరిస్థితి. ఏ సమయంలో ఏ గేటు మొరాయిందోనన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. మొత్తం 12 క్రస్ట్‌గేట్లు ఉండగా.. ఒక్కో గేటు 15 మీటర్ల వరకు ఎత్తేలా డిజైన్ చేసి ఉంది. వరద పోటెత్తినప్పుడు మొత్తం గేట్ల నుంచి గరిష్ఠంగా 5.5 లక్షల క్యూసెక్కుల వరకు నీరు వదిలే వెసులుబాటు ఉంది. అయితే గడిచిన ఐదేళ్ల కాలంలో వరద సమయంలో పలుగేట్లు మొరాయించి సిబ్బంది అవస్థలు పడిన సందర్భాలు ఉన్నాయి. ఏటా గేట్లకు చేయాల్సిన ఆధునికీరణ పనులపై శ్రద్ధ లోపించింది. జలాశయం నిండిన సందర్భంలో గేట్ల నీళ్లు దెబ్బతిని లీకేజీ కొనసాగుతున్నా నివారణ పనులు చేస్తున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ తక్కువగా ఉంది. ఈ సమయం పనులకు అనుకూలమైనా యంత్రాంగంలో చలనం లేదు.

గ్యాలరీలో సమస్యలు

జలాశయం గ్యాలరీ ప్రాంతంలో లీకేజీ అధికంగా ఉంటుంది. లీకేజీని తోడేందుకు 24 గంటలపాటు సిబ్బంది పని చేయాల్సిన అవసరం ఉండగా సిబ్బంది కొరత కారణంగా ఉన్న వారిపై పనిభారం పెరిగి శారీరక, మానసిక వేదనతో ఇబ్బంది పడుతున్నారు. ఇక గ్యాలరీకి అనుసంధానించిన లిఫ్ట్ కొన్నిసార్లు సాంకేతికతో మరమ్మతులకు గురవుండగా ఉద్యోగులు మెట్ల మార్గం నుంచి 100 అడుగుల కిందకు వెళ్లి విధులు నిర్వహించాల్సి ఉంది.

మట్టికట్ట పటిష్టంగా ఉందా!?

జలాశయం మట్టికట్ట పటిష్టతపై అనుమానం కలుగుతోంది. మట్టికట్ట నిర్మాణంపై ఏటా పరీక్షలు నిర్వహించి భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా పనులు చేసిన సందర్భాలు కరువయ్యాయి. దీంతో మట్టికట్టకు - కాంక్రీట్ నిర్మాణానికి వ్యత్యాసం నెలకొనగా సరిచేసే చర్యలు కరువయ్యాయి. ఇక కరకట్టలపై ఏర్పాటు చేసిన రివెట్‌మెంట్లపై మొక్కలు మొలచి మానులుగా మారుతున్నా చర్యలు లేవు.

పడకేసిన పర్యాటకం

జలాశయం వద్ద 2013లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన అతిథి భవన సముదాయం శిథిలావస్తకు చేరుకొంది. సుమారు 100 మంది బస చేసేలా డార్మెంటరీ ని వినియోగించుకోలేని పరిస్థితి. కోట్లాది రూపాయాలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు కూనరిల్లుతున్నాయి. ఇక వసతి ఏర్పాట్లు లేక సోమశిలకు వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.

అభివృద్ధికి నోచని కాలువలు

సోమశిల జలాశయం పరిధిలో ఉత్తర, దక్షిణ కాలువలు ఉండగా ఆదునికీరణ పనులు పడకేశాయి. ఉత్తర కాలువ 0 నుంచి 106 కి.మీ కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడు వరకు విస్తరించి ఉండగా కాలువ సామర్థ్యం పనులు చేసేలా చర్యలు చేపట్టారు. 750 క్యూసెక్కుల నుంచి 1,550 క్యూసెక్కులకు పెంచేలా ప్రణాళిక చేశారు. ఇదే తరహాలో దక్షిణ కాలువను 350 నుంచి 700 క్యూసెక్కులకు పెంచేలా తీసుకొన్న చర్యలు పూర్తిస్థాయిలో అమలు జరగక పోవడంతో పనులు స్తంభించాయి. ఇక తెలుగుగంగ వరద కాలువ గేటు ఏటా మొరాయిస్తోంది. జాకీలు పెట్టి గేటును ఎత్తాల్సిన పరిస్థితితో నీరు విడుదల, నిలుపుదల సమయంలో సిబ్బంది పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

జలాశయ పరిసరాల్లో రోడ్లు ధ్వంసం

ప్రాజెక్టు పరిసరాల్లో సుమారు 5 కి.మీ రోడ్లు విస్తరించి ఉండగా అవి అధ్వానంగా ఉన్నాయి. డ్యాం ఘాట్‌రోడ్డు రాళ్లు తేలి నరకప్రాయంగా ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దశాబ్ద కాలంగా రోడ్ల అబివృద్ధి జరగలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరికీ ప్రతిష్టాత్మకమే!

ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల పోరు ఆసక్తిగా మారింది. మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థిగా, సిట్టింగ్ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అర్థ, అంగ బలాల్లో ఇద్దరూ సమ ఉజ్జీలే. అయితే వైసీపీ నుంచి టీడీపీలోకి రోజు రోజుకు వలసలు జోరందుకుంటున్నాయి. ఆనం పోటీలో ఉండడం టీడీపీ శ్రేణుల్లో జోష్ పెంచింది.

-ఆత్మకూరు

ఆనం రామనారాయణరెడ్డి 2009లో తొలిసారిగా ఆత్మకూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి కూడా పనిచేశారు. అప్పట్లో ఆయన నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోట్ల నిధులు మంజూరు చేయించి, పలు అభివృద్ధి పనులు చేశారు. ముఖ్యంగా తాగు, సాగునీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆత్మకూరు రెవె న్యూ డివిజన్ ఏర్పాటు, మున్సిపాలిటీగా మార్పు, 100 పడకల ప్రభుత్వ వైద్యశాల, ప్రభుత్వ పాలిటె క్నిక్, ఐటీఐ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, హైలెవల్ బ్రిడ్జీలు, ఆత్మకూరు ప్రజలకు శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు సోమశిల నుంచి పైపులైను ఏర్పాటు పనులు చేయిం చారు. అప్పటి నుంచి ఆయన ఎక్కడ ఉన్నా ఆత్మకూరు ప్రజల ఆదరాభి మానాలకు దూరం కాలేదు. నియోజకవర్గంలో టీడీపీ అగ్రనేతలంతా ఏకం కావడం ఆనంకు మరింతగా కలిసివచ్చే అంశం. వర్గబలం గల కొమ్మి, బొల్లినేని, గూటూరు, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిల కలయిక ఆయన విజయానికి అదనపు బలం. వీటికి తోడు వైసీపీ ప్రభుత్వంపై ఉన్న ప్రజావ్యతిరేకత కూడా కలిసొచ్చే అంశం.



ఆనం రామ నారాయణ రెడ్డి

మేకపాటి విక్రమ్‌రెడ్డి

• పదేళ్లు నైరాశ్యం

ఆది నుంచి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఆత్మకూరులో పదేళ్ల క్రితం మేకపాటి కుటుంబం నుంచి రాజకీయ ఆరంగేట్రం చేసిన గౌతంరెడ్డిని ప్రజలు గెలిపించారు. 2019లోనూ గౌతమ్ విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆయన ఆకస్మిక మర ణంతో 2022లో జరిగిన ఉప ఎన్ని కల్లో ఆయన సోదరుడు విక్రమ్‌రెడ్డి విజయం సాధించారు. వైసీపీ ప్రాబల్యం పైనే ఆయన విజయం ఆధారపడి ఉంది. ఈ క్రమంలో నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో తన ప్రాబల్యం తగ్గకుండా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. అయితే పలువురు వైసీపీ నాయకులు పార్టీలో మారుతుండటం మేకపాటికి కంటి మీద కునుకులే కుండా చేస్తోంది. అంతేగాక ఆశించిన మేర నియోజకవర్గంలో అభివృద్ధి జరగకపోవడం ప్రతికూల అంశమైంది. 2014, 2019 ఎన్నికల్లో మేకపాటి గౌతంరెడ్డి పెద్దగా హామీలు ఇవ్వలేదు. ఇచ్చిన మూడు, నాలుగు హామీల సైతం నెరవేర్చలేదు. అసెంబ్లీలో గళమెత్తి పోరాడిన దాఖలాలు కూడా లేవు. ఇవన్నీ ప్రజల అసంతృప్తికి కారణ మయ్యాయి.

వర్తమానం

వాళ్లకు వాళ్లే కండువాలు కప్పుకుని..

- టీడీపీ నేతలు చేరారంటూ వైసీపీ ఫేక్ ప్రచారం

ఉలవపాడు: టీడీపీకి చెందిన పలు కుటుంబాలు భారీగా తమపార్టీలో చేరినట్లు ఫేక్ ప్రచారాలతో వైసీపీ నాయకత్వం ఆత్మసంతృప్తి పొందుతోంది. అయితే ఈ విషయాన్ని కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు ఓ ప్రకటనలో ఖండించారు. కాలనీలో తొలినుంచి కాంగ్రెస్‌లోనూ, అనంతరం వైసీపీలోనూ సానుభూతిపరులుగా ఉంటున్న ఒకటిరెండు కుటుంబాలవారికి వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ సమక్షంలో శుక్రవారం కండువాలు కప్పి టీడీపీవారు చేరారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. అయితే ఆ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు మాత్రం వైసీపీ ఫేక్ ప్రచారాలపై మండిపడుతున్నారు. గత నాలుగు రోజుల క్రితం కూడా టీడీపీ యువత భారీగా వైసీపీలో చేరిందని ప్రచారం చేసుకున్నారు. అలా చేరినవారిలో సగానికిపైగా ఓటు హక్కులేని విద్యార్థులని తేలింది. ఓవైపు మండలంలో ప్రతిగ్రామం నుంచి టీడీపీలోకి రోజురోజుకు వలసలు పెరిగిపోతుంటే, వైసీపీలో ఏర్పడిన అనిశ్చితి చర్చనీయాంశంగా మారింది.



వైసీపీ నాయకులకే పార్టీ కండువాలు కప్పి మళ్లీ వైసీపీలోకి ఆహ్వానిస్తున్న బుర్రా మధుసూదన్

అదీ సంగతి

వారు తొలగించడం.. వీరు కట్టడం!

'కోడ్'ను ఖాతరు చేయని అధికార పార్టీ నేతలు

తల పట్టుకుంటున్న అధికార యంత్రాంగం

సంగం, ఏప్రిల్ 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా తమనేమి చేస్తారనే ధీమానో లేదా అహంకారమో తెలియదు కానీ సంగం మండలంలోని సిద్దీపురం, వెంగారెడ్డిపాళెం, సంగం గ్రామాల్లో అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా మారింది. కొందరు వైసీపీ మద్దతుదారులు స్థానికుల ఇళ్ల గోడలపై జగన్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న అధికారులు ఇళ్ల యజమానులను అడిగితే ఎవరో వచ్చి కట్టి వెళుతున్నారని, ఈ విషయం మాకు తెలియదని సమాధానం ఇస్తున్నారు. దీంతో అధికారులు ఫ్లెక్సీలను తొలగించి చేతులు దులుపుకున్నారు. శుక్రవారం సంగంలో పలు ఇళ్లకు ఈ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఇలా ఇష్టప్రకారం ఫ్లెక్సీలను కడుతుండటంతో వాటిని తొలగించలేక అధికార యంత్రాంగం తల పట్టుకుంటోంది.



సంగంలోని ఓ దుకాణం గోడకు కట్టిన వైసీపీ బ్యానర్

ఎన్నికల విధుల్లోకి శిక్షణ ఐపీఎస్‌లు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి అన్ని జిల్లాలకు శిక్షణ ఐపీఎస్‌లను కేటాయిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాకు మయాంక్ మిశ్రా, ప్రతీక్‌సింగ్, కుష్‌మిశ్రా, సురజ్ డి, అబినవ్ ద్వివేది, జామాసోనార్, ఆషిమా వాశ్వాణి, అపర్ణలను కేటాయించారు. జిల్లాలోని నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవార్గాలకు ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ట్రైనీ ఐపీఎస్‌ను పర్యవేక్షణాధికారిగా నియమించనున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు వీరంతా జిల్లాలోనే ఉంటూ విధులు నిర్వహించనున్నారు.

మా రోజుల్లో

నెరవేర్చే హామీలే ఇచ్చేవారు!?

మేము వయసులో ఉన్న రోజుల్లో రాజకీయం ఎంతో నీతిగా విలువలతో కూడిన విధంగా ఉండేది. ప్రజలకు సేవ చేసే వారికి మాత్రమే పార్టీ పెద్దలు సీట్లు ఇచ్చేవారు. ఎన్నికల వేళ ప్రజలే వారి ఆర్థిక బాగోగులు చూసేవారు. బరిలో ఉన్న నేతలు నెరవేర్చే హామీలను మాత్రమే చెప్పి ఓట్లు అడిగే వారు. గెలిచాకా ఇచ్చిన వాగ్దానాలు తీర్చేవారు. అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా కనిపిస్తోంది. ఇప్పుడు ప్రచార ఆర్బాటం ఎక్కువగా ఉంది. మా రోజుల్లోలాగే ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఖర్చులు తగ్గి దేశ ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగుపడి ఉండేది.



- రామయ్యనాయుడు (81), సంజీవనగరం, అనంతసాగరం

తెలుసుకుందాం

బైండోవర్ అంటే...

ఏ ఎన్నికలు వచ్చినా తరచూ వినిపించేమాట బైండోవర్... అనగా బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచుతారు, గొడవలు సృష్టించేవారు, రౌడీషీటర్లు, బెల్టు దుకాణాదారులు, అసాంఘిక శక్తులపై నిఘా కూడా పెంచుతారు. ఎన్నికలవేళ ఫలానా వ్యక్తుల వల్ల శాంతిభద్రతలకు ఇబ్బంది కలుగుతుందని భావిస్తే, అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిస్తే పోలీసులు బైండోవర్ చేస్తారు. అలాంటి వారిని తహసీల్దారు లేదా ఆర్డీవో ఎదుట హాజరు పరుస్తారు. చట్టవ్యతిరేక పనులు చేయబోమని బాండ్ పేపర్ మీద లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి ఆరోజు నుంచి ఏడాదిపాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే ఇచ్చిన బాండులో ఎంత మొత్తం నమోదు చేసి ఉంటారో.. అంత మొత్తం జరిమానా చెల్లించాలి. అలా చెల్లించకపోతే నేరంగానే పరిగణిస్తారు. అతడిపై ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద కేసు నమోదు చేస్తారు. రెండు అంతకన్నా ఎక్కువ సార్లు బైండోవర్ అయితే రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది. అక్రమంగా పోలీసులు బైండోవర్ పెట్టారని ఎవరైనా భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు.

- అనంతసాగరం/ఉదయగిరి రూరల్

యువగళం

సమర్థులైన పాలకులను ఎన్నుకుంటా!

ఓటు అనే ఆయుధం దేశ, రాష్ట్ర ప్రజల తలరాతలు మార్చేలా ఉండాలి. అవినీతికి దూరంగా ఉండే సమర్థమైన నాయ కుడికి నా ఓటు వేస్తా. డిగ్రీ వరకు చదివా. ఈసారి ఎన్నికల్లో తొలి సారిగా ఓటు వేసే అవ కాశం వచ్చింది. ఓటు వేయబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఐదేళ్లగా ప్రజలు అభద్రతా భావనలో ఉన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, ఉపాధి కోసం వలసలను నివారించే నేతకే నేను ఓటేస్తా.



- కీలుకుప్ప శ్రీజ, బీఎస్సీ, పెనుబల్లి , బుచ్చిరెడ్డిపాళెం



9 కార్ల రోజా


ఎంత ఎమ్మెల్యే అయితే మాత్రం అన్ని కార్లు అవసరమా ఆయమ్మకి? అనే మాటలు నగరి నియోజకవర్గంలో జోరుగా వినిపిస్తున్నాయి. నామినేషన్‌తో పాటూ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో మంత్రి ఆర్కే రోజా తనకు 9 కార్లున్నట్టు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఆమె 6 కార్లున్నట్టు చూపగా ఈసారి మరో మూడు కలిపారు. జగన్ నవరత్నాలకు దీటుగా నవకార్లు సొంతం చేసుకున్నారని జనం మాటల్లో వినిపిస్తోంది. ఈ నవకార్లలో కోటికి పైగా విలువ చేసే బెంజ్ కారు కూడా ఉండడం విశేషం. ఈ కారు కొన్నపుడు ఆమె మీద విమర్శలు కూడా వైరల్ అయ్యాయి. హోండా పల్సర్ బైక్ కూడా రోజా ఆస్తుల్లో చూపారు. 2019లో గెలిచాక ఆస్తులు కూడా బాగానే కొన్నారే మంత్రిగారు అనే మాటలూ సాగుతున్నాయి. నగరి మండలం కీలపట్టు, వీరకావేరిరాజపురం, విజయపురం మండలంలోని పాతార్కాడులో 6.39 ఎకరాల వ్యవసాయ భూమి, భర్త సెల్వమణి నగరిలో 0.94 ఎకరాల వ్యవసాయ భూమి వీరికి ఉంది. అలాగే తెలంగాణలోని గచ్చిబౌలి, పుత్తూరులో ఇంటి స్థలాలు, భర్త సెల్వమణి పేరిట నగరిలో మూడు ఇంటి స్థలాలు కొనుగోలు చేసినట్లు చూపించారు. జగన్ ప్రభుత్వం పోరాడుతున్న మార్గదర్శిలోనూ రోజాకు దాదాపు రూ.40లక్షల చిట్ ఉండడం కూడా జనం మాటల్లో దొర్లుతోంది.

- పుత్తూరు అర్బన్

కుయ్యో మొర్రో..

బాబ్బాబ్బాబ్బాబూ.. అంటూ అధికారపార్టీవారు ఆ నాయకుల వెంటపడుతున్నారు. చీకటి పడ్డాక వారి ఇళ్ల వద్దకు చేరుకుంటున్నారు. 'నిజమేనబ్బా.. మీకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేకపోయా.. తప్పయి పోయింది. ఈసారి గెలిస్తే మీకేం కావాలంటే అది చేసుకోవచ్చు. ఈ ఎన్నికల్లో సహకరించండి' అని గెడ్డాలు పట్టుకుని బతిమాలుతున్నారు. శ్రీకాళహస్తిలో అధికార వైసీపీ వారి ఈ అవస్థలు చూసి పలువురు నవ్వుకుంటున్నారు. రకరకాల కారణాలతో పట్టణంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వారినీ, తటస్థంగా ఉండే ప్రముఖులను కూడా ఇలాగే ప్రాధేయపడుతున్నారు. రాత్రి పది గంటల నుంచి ఈ బుజ్జగింపుల పర్వం మొదలవుతోంది. అర్ధరాత్రి దాటినా కొనసాగుతూ ఉంటుంది. ఈ అర్ధరాత్రి అవస్థలు చూసిన స్థానికులు ఉదయం టీ దుకాణాల దగ్గర వీటిని చర్చకు పెడుతున్నారు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఎట్టబ్బా.. పార్టీ మూడొంతులు ఖాళీ అయిపోయాక మేల్కొన్నారు గదా మనోళ్లు' అని ఆ పార్టీ వాళ్లే అనుకుంటున్నారు.

- శ్రీకాళహస్తి




జన చేతనం



www.andhrajyothy.com

నాయకుడికి దూరచూపు ఉండాలి. అభివృద్ధికి అర్థం తెలియాలి. విజన్ కొరవడిన పాలన వర్తమానంలో కూరుకుపోతుంది. భవిష్యత్ తరాలకు ద్రోహం జరుగుతుంది. అభివృద్ధి అంటే ఓట్లలెక్కలు కాదు. అభివృద్ధి అంటే కరెంటు ఛార్జీలు పెంచి, పన్నులు పెంచి, ధరలు పెంచి, మద్యం ఏరులై పారించి... ఎడాపెడా బాదేసి సంక్షేమం అంటూ నగదు విదిల్చడం కాదు. అభివృద్ధి అంటే చదువుల పందిరి వేయడం. అభివృద్ధి అంటే ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం. అభివృద్ధి అంటే ఉపాధికి బాటలు పరవడం.. మరి ఒక్క ఛాన్స్‌తో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి చేసిందేమిటి? పాదయాత్రలో జిల్లా పారిశ్రామికాభివృద్ధిపై చెప్పిన మాటలన్నీ ఆచరణలో అమలయ్యాయా? అంతకుముందు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏం చేశారు? జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఇద్దరు నేతల ముద్రలేమిటో చూద్దాం...

తిరుపతి, ఆంధ్రజ్యోతి



విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు ఉన్న పేరు 2014-19 నడుమ నిజం అని రుజువైంది. విభజన తర్వాత రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన ఆయన జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక రంగాన్ని ఎంచుకున్నారు. ఫలితం.. ఆ ఐదేళ్లలో దేశ, విదేశీ, బహుళ జాతి కంపెనీలెన్నో జిల్లాలో కొలువు దీరాయి. రూ. వేల కోట్ల పెట్టుబడులు ప్రవహించాయి. 2014-19 నడుమ 50 వేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. ప్రజల జీవన ప్రమాణాలూ వృద్ధి చెందాయి.



2019 ఎన్నికల్లో గెలిచి జగన్‌రెడ్డి సీఎం అయ్యారు. అప్పటి దాకా పనులు మొదలు పెట్టని పరిశ్రమల యాజమాన్యాలన్నీ హడావిడిగా నిర్ణయాలు మార్చుకున్నాయి. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలను విరమించుకున్నాయి. కొత్త ప్రతిపాదనలూ లేవు. ఉన్నవి తప్పితే అదనంగా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు. అనేక పరిశ్రమలు విస్తరణను విరమించుకున్నాయి. రిలయన్స్ జియో వెనక్కి వెళ్లింది. అమరరాజ పొరుగు రాష్ట్రాలకు పారిపోయింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం పాలనా తీరుకు కొలబద్దగా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి స్తంభించిపోయింది.

2019-24
జగన్ పాలనలో
చీకట్లు

ప్రతిపక్ష నేతగా ఏం చెప్పారు?

2018 జనవరి 21న పాదయాత్రలో భాగంగా శ్రీకాళహస్తికి వచ్చారు. తాను అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తానని, ఆ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరికేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సీఎంగా ఏం చేశారు?

2019 జూన్‌లో అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ ఒక్కటంటే పరిశ్రమ కూడా శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో ఏర్పాటు చేయలేదు. జిల్లాలో ఎక్కడా కొత్తగా ఒక్క పరిశ్రమా రాలేదు.

జిల్లా పారిశ్రామిక చిత్రపటం

'అపాచీ' ఎక్కడ?

శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు వద్ద అపాచీ సంస్థ ద్వారా రూ.700 కోట్లతో భారీ పాదరక్షల తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు జగన్ ప్రభుత్వం హడావిడి చేసింది. 2022 జూన్ 23న సీఎం జగన్ ఇలగనూరుకు వచ్చి శంకుస్థాపన కూడా చేశారు. ఈ పరిశ్రమతో 10 వేల మందికి ఉపాధి లభిస్తుందని, అందులో 80 శాతం మంది మహిళలే ఉంటారని జగన్ ప్రకటించారు. 2023 సెప్టెంబరుకల్లా పనులు పూర్తవుతాయని, ఈ ప్రాంతానికి కొత్త ఉషోదయం ప్రారంభమవుతుందని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ పనులే మొదలు కాలేదు. భూమి పూజ జరిగిన చోట శంకుస్థాపన శిలాఫలకం ఆనవాళ్లు కూడా లేకుండా మాయం చేశారు. అక్కడి బీడు భూములు జగన్ శంకుస్థాపన తంతును వెక్కిరిస్తున్నాయి.



ఈ బూట్లే ఇక్కడ తయారయ్యేదంటూ శంకుస్థాపన రోజున సీఎం జగన్‌కు చూపుతున్న యాజమాన్య ప్రతినిధులు

అపాచీ శిలాఫలకం చివరికి ఇలా మిగిలింది



2014-19
చంద్రబాబు హయాంలో
వెలుగులు





ఎలక్ట్రానిక్ హబ్

తిరుపతికి పుణ్యక్షేత్రంగానే కాకుండా ఎలక్ట్రానిక్ హబ్‌గా కూడా పేరు తేవాలని చంద్రబాబు ఉబలాటపడ్డారు. విమానాశ్రయానికి చేరువగా ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేయించారు. ప్రఖ్యాతి గాంచిన పరిశ్రమలు వచ్చేలా చొరవ చూపారు. డిక్సన్, సెల్కాన్, టీసీఎల్, కార్బన్, టెల్ లింక్స్, సన్నీ ఆప్‌టెక్, ఫాక్స్‌లింక్, సెవెన్ హిల్స్ డిజిటల్ పార్క్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ యూనిట్లు వెలిశాయి. వాటన్నింటికీ ఆయనే శంకుస్థాపన.. ప్రారంభోత్సవాలు చేశారు. ఈఎంసీ-1లోనే 13,851 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. తర్వాత నెలకొల్పిన ఈఎంసీ-2 ఇదే రీతిలో అభివృద్ధి చేశారు. ఈ రెండు క్లస్టర్ల నిర్వహణ కోసమే విమానాశ్రయం వద్ద ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసి ఐఏఎస్ అధికారిని సీఈవోగా నియమించారు.

- ఏర్పేడు మండలం పాగాలి వద్ద రాక్‌మెన్ ప్లైవుడ్ పరిశ్రమ, ప్రకాష్ స్టీల్స్ ఫెర్రో కంపెనీలు, ఓస్వీన్ వుడ్ ప్యానెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.
- తొట్టంబేడు మండలంలో గ్రీన్ ప్యానెల్, కజారియా టైల్స్, అక్సారా పరిశ్రమలు వచ్చాయి.
- నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో ప్రైమ్ ఎలక్ట్రికల్స్, అరబిందో ఫార్మా, జెల్ క్యాప్స్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఒక జెల్ క్యాప్స్ కంపెనీ ద్వారానే సుమారు 10 వేల మందికి ఉపాధి దక్కుతోంది.
- తడ మండలం మాంబట్టులో ఇండజ్ కాఫీ, టాటా కెమికల్స్, మ్యాక్స్ కింగ్ పరిశ్రమలు, సూళ్లూరుపేటలో తారకేశ్వర టెక్స్‌టైల్స్ పార్క్ స్థాపితమయ్యాయి. ఈ మండలంలోనూ పది వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి.
- సత్యవేడు మండలంలో హీరో మోటార్స్, వరదయ్యపాలెం మండలంలో కాంటినెంటల్ కాఫీ, అపోలో టైర్స్ వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు వచ్చాయి. ఈ మూడింటిలోనే పది వేల మందికి ఉద్యోగాలు దొరికాయి. సత్యవేడు, శ్రీకాళహస్తి, నగరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల యువత ఈ పరిశ్రమలతో లబ్ధి పొందుతున్నారు.



చంద్రబాబు రప్పించిన వాటికే ప్రారంభోత్సవాలు

రేణిగుంట విమానాశ్రయానికి వెనుకవైపున ఉన్న ఎలక్ట్రానిక్స్ మ్యాన్యుఫాక్చరింగ్ క్లస్టర్-1లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసిన టీసీఎల్ పరిశ్రమను 2022 జూన్ 23న సీఎం జగన్ ప్రారంభించారు. అదే క్లస్టర్‌లోనే సన్నీ ఓపో టెక్ కంపెనీకి సంబంధించిన మొబైల్ ఫోన్లకు సంబంధించిన కెమెరా మాడ్యూల్స్ తయారీ యూనిట్.. ఫాక్స్ లింక్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఆ క్లస్టర్‌లోనే సెవెన్ హిల్స్ డిజిటల్ పార్క్ విస్తరణకు, క్లస్టర్ 2లోని డిక్సన్ టీవీ తయారీ యూనిట్‌కు శంకుస్థాపనలు చేశారు. ఇవన్నీ కూడా టీడీపీ ప్రభుత్వంలో జిల్లాకు వచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకున్నవి.. చంద్రబాబు భూమి పూజ చేసినవే కావడం గమనార్హం.

'రిలయన్స్ జియో' వెనుకంజ

తిరుపతి వద్ద రూ. 15 వేల కోట్లతో రిలయన్స్ జియో ఇండస్ట్రీ ఏర్పాటుకు 2018 ఫిబ్రవరిలో విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో నాటి సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని ఒప్పించారు. ఈ మేరకు ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఫోన్లు, టీవీలు, సెట్‌టాప్ బాక్సులు, ఎలక్ట్రానిక్ పరికరాలు తయారీ చేసే ఈ పరిశ్రమ ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. రేణిగుంట మండలంలో 150 ఎకరాలను అధికారులు సేకరించారు. పది లక్షల ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచశ్రేణి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు కావాల్సిన తరుణంలో ప్రభుత్వం మారింది. రిలయన్స్ జియో కోసం సేకరించిన 150 ఎకరాలకు పరిహారం సంతృప్తికరంగా లేదని 12 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. రైతులతో చర్చించి ఒప్పించేందుకు, సమస్యను పరిష్కరించేందుకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చొరవా తీసుకోలేదు. ప్రభుత్వ తీరుతో రిలయన్స్ విసిగిపోయింది. తాము పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకుంటున్నట్టు 2019 నవంబరులో ప్రకటించింది. తద్వారా పేరు ప్రఖ్యాతులు, యువతకు ఉపాధి పొందాల్సిన జిల్లా తీవ్రంగా నష్టపోయింది.

అమరరాజను వేధించి వెళ్లగొట్టారు

రేణిగుంట మండలం కరకంబాడి వద్ద 1985 డిసెంబరులో గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి దంపతులు స్థాపించిన అమరరాజా బ్యాటరీస్ దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సంస్థ. రూ. 11 వేల కోట్లకు పైగా వార్షిక టర్నోవర్‌తో నడుస్తున్న ఈ పరిశ్రమ జిల్లాలో 16 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చీ రావడంతోనే అమరరాజపై వేధింపులు మొదలయ్యాయి. యాదమరి మండలం నూనెగుండ్లపల్లె వద్ద కూడా అమరరాజా సంస్థ బ్యాటరీల తయారీ ప్రారంభించింది. ఈ రెండు చోట్లా నడుస్తున్న తొమ్మిది యూనిట్ల వల్ల కాలుష్యం ఏర్పడుతోందని కారణం చూపుతూ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జారీ చేసిన ఆదేశాలతో 2021 మే 1న ఎస్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో సంస్థకు రూ. 50 కోట్ల మేర నష్టం వాటిల్లింది. తర్వాత కూడా వేధింపులు కొనసాగడంతో విసిగివేసారిన అమరరాజా సంస్థ తదుపరి విస్తరణ యూనిట్లను ఇరుగుపొరుగు రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఆ మేరకు 2023 మేలో తెలంగాణలో రూ. 9500 కోట్ల పెట్టుబడితో లిథియం బ్యాటరీల తయారీ యూనిట్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ ప్లాంటు జిల్లాలో ఏర్పాటు కాకపోవడం వల్ల రూ. 9500 కోట్ల పెట్టుబడులు, 4500 ఉద్యోగాలను జిల్లా కోల్పోవాల్సి వచ్చింది. కొత్త పరిశ్రమలు జిల్లాకు తీసుకురాకపోగా వున్న వాటిని జిల్లా నుంచీ వెళ్ళగొట్టేలా అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని జిల్లా ప్రజలు మండిపడ్డా కక్షల రాజకీయాల్లో తేలే నాయకులు తప్పు దిద్దుకోలేదు.



స్వర్ణముఖిపై 'బియ్యపు' గాలిమేడలు

చెవిలో పువ్వు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: భక్తులు పరమ పవిత్రంగా భావించే స్వర్ణముఖి నది అధ్వాన స్థితికి అద్దం పడుతున్న చిత్రమిది. అగస్త్య మహర్షి తపోశక్తితో ఉత్తర వాహినిగా స్వర్ణ వర్ణ కాంతులతో ఉద్భవించిన నదిని సువర్ణముఖిగా భక్తులు ఆరాధిస్తుంటారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి స్వర్ణముఖి నదిని ప్రస్తావించిన ప్రతిసారి అద్భుతాలు సృష్టిస్తాననడం అలవాటుగా మారిపోయింది. ఎమ్మెల్యేగా గెలిచాక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఇరిగేషన్ అధికారులతో తొలి సమావేశం నిర్వహించి స్వర్ణముఖికి మోక్షం వచ్చిందని ప్రకటన చేశారు. చరిత్రలో నిలిచిపోయేలా ఈ నదిని ప్రక్షాళన చేస్తున్నామన్నారు. నదిపై చెక్ డ్యాములు నిర్మిస్తామని.. ఏడాది పొడవునా జలకళ తీసుకొస్తామని చెప్పుకొచ్చారు. సుందరమైన స్నాన ఘట్టాలు, లైటింగ్, బోటింగ్, లేజర్ షోలు.. ఒక్కటేమిటి ప్రజలను ఊహల పల్లకిలో ఊరేగించారు. స్వర్ణముఖి కరకట్టలను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాకింగ్ ట్రాక్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. తర్వాత ప్రైవేట్ ఎక్స్‌కవేటర్ల యజమానులను పిలిపించి మొక్కుబడిగా ఒకసారి పిచ్చి మొక్కలను తొలగించారు. తర్వాత కొద్ది నెలలకే మళ్లీ పాత వాతావరణం ఏర్పడింది. ముక్కంటి ఆలయం వద్ద పడమర వైపున స్వర్ణముఖి కరకట్టను నిర్మించారు. అది కూడా ఫ్లడ్ వాల్ తక్కువ ఎత్తులో. దానిపైన గ్రావెల్ ఎక్కువ ఎత్తులో అనాలోచితంగా నిర్మించారు. కొద్ది నెలలకే గ్రావెల్ కోతకు గురైంది. నదిలోకి జారడంతో కొత్త కట్ట అధ్వానంగా మారింది. స్వర్ణముఖి గతం కన్నా దయనీయంగా మారిపోయింది. గతంలో మురుగునీరు, వ్యర్థాలు కొంత కలిసేవి. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో ప్రైవేట్ లాడ్జిలు పెరిగిపోవడం, మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. లైటింగ్, బోటింగ్, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రమంటూ చెప్పిన మధుసూదనరెడ్డి మాటలన్నీ నీటిమూటలేనని ప్రజలు విమర్శిస్తున్నారు.



ఫ్యాను రెక్కలు ముక్కలు



సూళ్లూరుపేట వర్తమానం

తడ, ఏప్రిల్ 20: సూళ్లూరుపేట వైసీపీని అసమ్మతి పుట్టి ముంచేటట్టే ఉంది. మరోవైపు టీడీపీ జోరు పెంచుకుంటోంది. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన కిలివేటి సంజీవయ్య గెలుపొందారు. రెండోసారి గెలిచాక ఆయన వైఖరిలో వచ్చిన మార్పు పార్టీ శ్రేణులను నెమ్మది నెమ్మదిగా దూరం చేసింది. అనుకూల, ప్రతికూల వర్గాలుగా పార్టీ చీలిపోయింది. పార్టీ కార్యక్రమాల్లోనూ ఇదే ప్రస్ఫుటమవుతోంది. చాలామంది నాయకులు పైకి పార్టీ కోసమే పనిచేస్తున్నామని చెబుతున్నా లోన రగిలిపోతూనే ఉన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగానే సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయకులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయారు. ఏడాది క్రితం మాటల దాడితో సరిపెట్టుకున్న ఇరువర్గాలు ఆ తరువాత ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారు. ఈ నియోజకవర్గ పరిస్థితిపై అధిష్ఠానానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెండువర్గాల మధ్య సయోధ్య కోసం పార్టీ పెద్దలు చేసిన కృషి ఫలించలేదు. అదే సమయంలో మరోసారి కిలివేటికి టిక్కెట్ ఇస్తే ఓడిస్తామంటూ బహిరంగంగానే వ్యాఖ్యలు చేసినా అధిష్ఠానం పట్టించుకోలేదు. కిలివేటి టిక్కెట్ అయితే తెచ్చుకున్నారు గానీ అసమ్మతి నాయకులను మాత్రం దారిలోకి తెచ్చుకోలేకపోయారు. కొందరు పార్టీవీడి టీడీపీలో చేరిపోయారు. పెళ్లకూరు మండలంలో జరుగుతున్న మట్టి తవ్వకాల్లో వాటాలపై ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డికీ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డికీ మధ్య జరిగిన వివాదం పార్టీ పరువును బజారున పడేసింది. ఇక ఏకంగా ప్రచారంలోనే పార్టీనేతలు బాహాబాహీలకు దిగుతున్నారు. ఈ గొడవలతో చెంగాళమ్మ ఆలయ మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్, అసమ్మతి నేత దువ్వూరు బాలచంద్రారెడ్డి అలిగి హైదరాబాదుకు వెళ్లిపోయారు. టీడీపీ మీద అలిగిన వేనాటి రామచంద్రారెడ్డిని వైసీపీలోకి తెచ్చుకున్నామన్న ఆనందం కూడా ఆ పార్టీకి మిగలడం లేదు. ఆయన అనుచరులెవ్వరూ టీడీపీని వీడి రాలేదు.

సైకిల్ జోరు

బలమైన ఓటు బ్యాంకు ఉన్నా గత రెండు ఎన్నికల్లో టీడీపీని గ్రూపు రాజకీయాలు దెబ్బతీశాయి. 2014లో టీడీపీ అభ్యర్థి పరసా వెంకటరత్నం 3,762 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2019లో కూడా పాత పరిస్థితే విజయాన్ని దూరం చేసింది. గడచిన ఐదేళ్లుగా పార్టీలో నాయకులు కలసి పనిచేయడం ప్రారంభించారు. విభేదాలను పక్కన పెట్టి క్యాడర్‌ను ఒక తాటిమీదకు తెచ్చేలా అధిష్ఠానం చర్యలు తీసుకొంది. టీడీపీకి పెద్ద దిక్కుగా వ్యవహరించిన వేనాటి రామచంద్రారెడ్డి పార్టీని వీడినా కేడర్ మాత్రం పార్టీకి వెన్నుదన్నుగా నిలబడింది. వైసీపీ నుంచి రఫీ, పుట్టు రమణమూర్తి, తాటిపర్తి శ్రీనివాసులరెడ్డి, నలుబోయిన రాజసులోచనమ్మ వంటి నాయకులు టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె విజయశ్రీని అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీలో అన్ని వర్గాలూ కలసి పనిచేస్తున్నాయి. పరసారత్నం వంటి నాయకులు కూడా ఆమె అభ్యర్థిత్వానికి జై కొట్టారు. బీజేపీ, జనసేన జత కట్టడం టీడీపీకి కలిసొచ్చే అంశం. గత ఎన్నికల్లో జనసేనకు ఇక్కడ 5,513, బీజేపీకి 1729 ఓట్లు పోలయ్యాయి. ప్రచారంలో కూటమి పక్ష శ్రేణులు చురుగ్గా పాల్గొనడంతో టీడీపీలో చాన్నాళ్ల తర్వాత సమరోత్సాహం వెల్లివిరుస్తోంది.

కాంగ్రెస్ ఓట్లతో వైసీపీకి ముప్పు

కాంగ్రెస్ తరఫున నాయుడుపేటకు చెందిన గాడి తిలక్‌బాబు బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2698 ఓట్లు వచ్చాయి. ఈసారి ఓట్లు పెరుగుతాయని ఆపార్టీ వర్గాలు ధీమాగా చెబుతున్నాయి. వీరి ఓట్లశాతం పెరిగితే వైసీపీకి నష్టమని రాజకీయ పరిశీలకుల అంచనా.

చంద్రబాబు రాకతో టీడీపీలో పెరిగిన జోష్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 20: చంద్రబాబు ప్రజాగళం సూపర్ సెక్స్‌తో గూడూరు తెలుగుదేశంపార్టీలో ఉత్సాహం నెలకొంది. శనివారం స్థానిక సీఆర్‌రెడ్డి కళ్యాణమండపం ఆవరణ ంలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమానికి మహిళలు పోటెత్తారు. ముందుగా 2వేల మందితో సభ నిర్వహించాలని భావించినా బహిరంగసభలా తయారు కావడంతో దేశం వర్గాలలో ఆనందం వెల్లివిరిసింది. చంద్రబాబు ప్రసంగిస్తున్నంతసేపు మహిళలు ముఖ్యంగా యువతులు కేరింతలతో సభ మార్మోగిపోయింది. సీఎం...సీఎం... అంటూ యువతులు నినాదాలు చేయడంతో చంద్రబాబు ప్రసంగం కూడా హుషారుగా సాగింది. చంద్రబాబు సూపర్-6 పథకాల గురించి వివరిస్తున్నప్పుడు సభికుల్లో సంతోషం నిండింది. అధికారంలోకి వచ్చిన వెంటనే గూడూరు నియోజవర్గాన్ని నెల్లూరుజిల్లాలో విలీనం చేస్తానని ప్రకటించడంతో మహిళల హర్షధ్వానాలు మిన్నంటాయి. గూడూరుతో తనకున్న అనుబంధాన్ని చంద్రబాబు పదేపదే ప్రస్తావించి



నప్పుడు కూడా హర్షాతిరేఖాలు వ్యక్తమయ్యాయి. తన జన్మదిన వేడుకలు గూడూరులో అందరి సమక్షంలో ముఖ్యంగా మహిళల మధ్యన జరుపుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా చంద్రబాబు పేర్కొన్నపుడు మహిళల్లో విశేష స్పందన కనిపించింది. సుమారు గంటకుపైగా సాగిన చంద్రబాబు ప్రసంగం ఆద్యంతం ఉత్సాహంగా సాగడంతో స్థానిక దేశం శ్రేణుల్లో ధీమా పెరిగినట్లైంది. ఈ ఐదేళ్లల్లో జగన్ పాలన గురించి వివరిస్తూ, ప్రభుత్వంలో ఒక్కో వైఫల్యం గురించి ప్రస్తావిస్తూ, ప్రశ్నిస్తూ మహిళల నుంచి సమాధానాలు రాబట్టుకుంటూ సాగిన చంద్రబాబు ప్రసంగం సర్వత్రా ఆకట్టుకుంది.

కాబోయే సీఎం చంద్రబాబే: పాశం

అపూర్వ ప్రజాదరణతో రాబోయే ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ విజయకేతనం ఎగురవేసి చంద్రబాబే సీఎం అవుతారని గూడూరు ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం చంద్రబాబు ప్రజాగళంలో ఆయన ప్రసంగిస్తూ గూడూరును నెల్లూరుజిల్లాలో విలీనం చేయాలని చంద్రబాబునాయుడుకి విజ్ఞప్తి చేశారు. విజన్ ఉన్న నాయకుడి రానున్న పాలనలో తెలుగుజాతి కీర్తి నలుమూలలా వ్యాపిస్తుందని చంద్రబాబును కొనియాడారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను గూడూరులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఆర్‌రెడ్డి కల్యాణమండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని పార్టీ శ్రేణులను ఉత్సాహ పరిచారు. అదేవిధంగా కల్యాణమండపం ఆవరణలో ఏర్పాటు చేసిన సభాస్థలి వద్ద మహిళలందరి సమక్షంలో చంద్రబాబు కేక్ కట్‌చేసి పాశం సునీల్‌కుమార్‌కు, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావుకు, నాయకులకు పంచిపెట్టారు. సభకు హజరైన మహిళలు, నాయకులు చంద్రబాబు సభాస్థలికి రాగానే హ్యాపీ బర్త్‌డే అంటూ పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలపడంతో సభాప్రాగణం మార్మోగింది.

నాయుడుపేట టౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును సన్మానించారు. శనివారం గూడూరు సభలో పాల్గొన్న చంద్రబాబును సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ శాలువా కప్పి సన్మానించారు. టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, నాయకులు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, నిత్య కృష్ణారెడ్డి, వి.శోభన్ నాయుడు, ఎస్‌కె కాలేషా, విజయకుమార్ నాయుడు, ఆకుతోట రమేష్, పేరం మధుసూదన్ నాయుడు తదితరులున్నారు.

ఓజిలి: పట్టణంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనవాసులు రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కె.సత్యవరప్రసాద్‌రావు, పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కె ఖలీల్, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు పవిత్రారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకను ఘనంగా జరుపుకున్నారు.



చంద్రబాబుకు కేక్ తినిపిస్తున్న పాశం సునీల్‌కుమార్

తడ: మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు 74వ పుట్టిన రోజు వేడుకలను తడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బజారు కూడలిలో భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీరెడ్డి, శ్రీధర్, పళణి, సెల్వం, నీలకంఠం, రవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో ముఖాముఖి

గూడూరు, ఏప్రిల్ 20: 'మగ వాళ్లకంటే ఎక్కువ డబ్బులు సంపాదించే తెలివితేటలు ఆడపడుచులకు వచ్చాయంటే టీడీపీ చూపించిన చొరవే' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. గూడూరులో శనివారం నిర్వహించిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు చంద్రబాబుకు పలు సూచనలు చేశారు.

మహాశక్తి ద్వారా పెద్దపీట



టీడీపీ ప్రకటించిన సూపర్6లో మహాశక్తి పథకానికి పెద్దపీట వేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారంటే అందుకు చంద్రబాబే స్ఫూర్తి. ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఏడాది రూ.15వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి ఉపయోగకరంగా ఉన్నాయి.

\- శ్రీదేవి

కలల రెక్కలకు ఆశల చిగురింపు



2022లో ఇంటర్ పూర్తయ్యింది. నాకు ఫ్యాషన్ డిజైన్ చదవాలని కోరిక. అయితే ఆర్థిక స్తోమత లేకపోవడంతో చదవలేకపోయా. చంద్రబాబు ప్రస్తుతం కలలకు రెక్కలు అనే కార్యక్రమాన్ని తీసుకురావడం ద్వారా తనలాంటి ఎంతో మంది తిరిగి చదువులు కొనసాగించాలనే ఆశలు చిగురిస్తున్నాయి. చదువులకు టీడీపీ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపేందుకు ఈ పథకమే నిదర్శనం.

\- ప్రవళిక

నర్సింగ్ విద్యార్థులను ప్రోత్సహించండి



నర్సింగ్ విద్యార్థులను ప్రోత్స హించండి. నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడంతోపాటు నర్సింగ్ పూర్తి చేసున్న వారికి ఉద్యోగ భద్రత కల్పిం చేలా చర్యలు తీసుకోండి.

\- సైదా షేక్

నాసిరకం మద్యాన్ని అరికట్టండి



నాసిరకం మద్యం కారణంగా చాలామంది అనారోగ్యాల పాలవుతున్నారు. నా భర్త ఒకటిన్నర సంవత్సరం క్రితం నాసి రకం మద్యం తాగి అనారోగ్యానికి గురై చనిపోయాడు. ఇద్దరు ఆడపిల్లలను నేనే చదివించుకుంటున్నా. చిన్న పల్లెటూర్లల్లో కూడా రెండు, మూడు మద్యం దుకాణాలను నడుపుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామాల్లో బెల్టు దుకాణాలు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి

\- రమాదేవి

వెంకటగిరిలో చంద్రబాబు జన్మదిన సంబరాలు





చంద్రబాబు జన్మదినం సందర్భగా కేక్ కట్ చేస్తున్న లక్ష్మీసాయిప్రియ - చిట్టి తల్లీ ... చంద్రబాబు సీఎం అయ్యాక నీ భవిష్యత్తుకు బాటలు వేస్తా...

వెంకటగిరి, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు భవిష్యత్ తరాలకు దిక్సూచి అని కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. శనివారం ఆమె తన నివాసంలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యువత బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. నేడు రాష్ట్రం అనాథగా మారిపోయిందని, దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. చంద్రబాబుతోనే అమరావతి నిర్మాణం సాధ్యమన్నారు. పి.రాజేశ్వరరావు, బి.రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్‌నాయుడు, పి.విశ్వనాథనాయుడు, శ్రీరామదాసు గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, గట్టమనేని గోపి, కాపా శ్రీనివాసులునాయుడు, మల్లారం బాబు, గొల్లగుంట మురళి, పప్పు చంద్రమౌళిరెడ్డి, బాబునాయుడు, పి.కోటేశ్వరరెడ్డి, జనసేన నాయకులు టి.క్రిష్ణయ్య, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా లక్ష్మీసాయిప్రియ ప్రచారం

వెంకటగిరి/డక్కిలి: మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ తండ్రి గెలుపు కోసం నియోజకవర్గంలో సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో యువతతో పాటు, మహిళలను, అవ్వాతాతలను ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రచారాన్ని పూర్తి చేశారు.ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వస్తే అవ్వాతాతలకు రూ.4 వేల పింఛనును ఇంటికే వచ్చి ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. దీంతో సాయిప్రియను దీవించి పంపుతున్నారు. చిన్నారుల భవిషత్తును చంద్రబాబు చూసుకుంటారని తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నారు. వృద్ధులు, వికలాంగులను ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆమె ప్రచారం నిర్వహించిన ప్రతి గ్రామంలో ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పడుతున్నారు. ఇక యువత ప్రతినిధిగా వారికి తాను అండగా నిలుస్తానని వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యు వతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని భరోసా ఇస్తున్నారు. అంతే కాకుండా ఆమె ప్రచార కార్యక్రమంలో ఎక్కువగా యువత పాల్గొంటూ సూపర్ సిక్స్ పథకాల గురించి జనానికి విశదీకరిస్తున్నారు. మండు టెండను సైతం లెక్కచేయకుండా ఆమె ప్రచారం సాగిస్తున్నారు.

టీడీపీలో పలువురి చేరిక

చిల్లకూరు, ఏప్రిల్ 20: హెలిప్యాడ్ వద్ద శనివారం చంద్రబాబు నాయుడు సమక్షంలో పలువురు నాయకులు టీడీపీలో చేరారు. కోట మండలానికి చెందిన నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిట్టమూరు మండలానికి చెందిన దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, వాకాడు మండలానికి చెందిన నన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, దువ్వూరు జనార్దన రెడ్డి, చిల్లకూరుకు చెందిన దువ్వూరు కృష్ణారెడ్డితోపాటు మరికొందరు పార్టీలో చేరారు.

వైసీపీ... ఓ డ్రామా కంపెనీ

● తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు





వరప్రసాద్‌ను సభకు పరిచయం చేస్తున్న చంద్రబాబు - జన్మదినం సందర్భంగా వరప్రసాద్ సమక్షంలో కేక్ కట్ చేస్తున్న చంద్రబాబు

గూడూరు అర్బన్/ సర్వేపల్లి/ సత్యవేడు, ఏప్రిల్ 20: మానవత్వంలేని జగన్ సారథ్యంలోని వైసీపీ ఓ డ్రామా కంపెనీగా తయారైందని ఉమ్మడి పార్టీల తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు అభివర్ణించారు. శనివారం చంద్రబాబు సారథ్యంలో నిర్వహించిన ప్రజాగళం సభలో ముందుగా ప్రసంగించిన వరప్రసాద రావు జగన్‌పై విరుచుకుపడ్డారు. చేదు తరువాత తీపి తెలుస్తుందని 12 ఏళ్ల వైసీపీలో తన ప్రయాణంలో చేదేదో తీపేదో తెలిసిందన్నారు. మానవత్వంలేని నాయకుడిగా జగన్‌ను విమర్శిస్తూ తాను దళితుడన్న కారణంతోనే చిన్నచూపు చూసి ఈ ఐదేళ్లల్లో ఎమ్మెల్యేగా వున్న తనను గూడూరులో ముప్పతిప్పలు పెట్టారని విమర్శించారు. జగన్ మాటలకు చేతలకు ఎంతో తేడా ఉందని ఆయననలో నిలువెత్తు అవినీతి, అహంకారం నిండిపోయాయని చంద్రబాబు ఒక్కడే ఆయనకు గుణపాఠం చెప్పగలరని ఘాటుగా వివర్శించారు. చిల్లకూరు సిలికాను, స్వర్ణముఖిలో ఇసుకను దోచుకుని తాడేపల్లి ప్యాలస్‌లో దాచుకున్నారన్నారు. చెల్లికి న్యాయం చేయలేని, తల్లికి గౌరవం ఇవ్వలేని నాయకుడు ప్రజలకు ఏమి చేస్తాడని సూటిగా ప్రశ్నించారు.

బీసీలను మోసం చేసిన వైసీపీ: నెలవల

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20: బీసీలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం అన్నారు. మండల పరిధిలోని సామంతమల్లాంలో శనివారం టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీతో కలసి ప్రచారం నిర్వహించారు. 56 కార్పోరేషన్లను ఏర్పాటు చేసి నిర్వీర్యం చేశారన్నారు. చంద్రబాబు హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, పనిముట్లను అంద జేశారన్నారు. అనంతరం ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, నాయకులు కరకంబేటి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. కాగా చెంగాళమ్మ ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ స్వర్గీయ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి ఇసనాక వాణి శనివారం గూడూరులో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఆమె చేరికతో కోటపోలూరులో వైసీపీకి భారీ షాక్ తగిలింది.



సామంతమల్లాంలో విజయశ్రీ ప్రచారం

పెళ్లకూరు: మండలంలోని రావులపాడులో శనివారం విజయశ్రీ ప్రచారం చేశారు. బాలచంద్రానాయుడు, కేవీ నాయుడు, మోహన్‌నాయుడు, హరిబాబునాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. వి.మురళీకృష్ణా రెడ్డి, ఎ.నరేంద్ర రెడ్డి, ఎస్.కృష్ణయ్య, ఉయ్యాల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30మంది వలంటీర్ల రాజీనామా

నాయుడుపేట/ కోట, ఏప్రిల్ 20: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 13 సచివాలయాల నుంచి 12 మంది వలంటీర్లు శనివారం తమ విధులకు రాజీనామా చేస్తూ ఆ పత్రాలను కమిషనర్ జనార్దన రెడ్డికి అందజేశారు. అలాగే మండల పరిషత్ పరిధిలోని 10 సచివాలయాల నుంచి 12 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేస్తూ ఎంపీడీవో ఏపీఆర్ కుమార్‌కు పత్రాలను అందజేశారు. కోట మండలం సిద్ధవరం సచివాలయ పరిధిలోని కర్లపూడి పంచాయతీకి చెందిన ఆరుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు.

షార్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ...

60 లక్షలకు టోకరా ● స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 20: కేంద్రప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.60 లక్షలకు టోకరా పెట్టిన సంఘటన వెలుగు చూసింది. బాధితుల కథనం మేరకు... నాయుడుపేట పట్టణంలోని మంగపతి నాయుడు నగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఈ క్రమంలో నెల్లూరు నుంచి నాయుడుపేటకు రైలులో వస్తుండగా అభినవరెడ్డి దంపతులు పరిచయమయ్యారు. కొద్దిరోజుల తరువాత శ్రీహరికోటలో ఉద్యోగాలు ఇప్పిస్తానని శ్రీనివాసులును అభినవరెడ్డి నమ్మబలికాడు. శ్రీనివాసులు మరో ముగ్గురు స్నేహితుల నుంచి దాదాపు రూ.7 లక్షలు అకౌంట్‌లో, నగదు రూపంలో అభినవరెడ్డికి ఇచ్చాడు. అదే సమయంలో శ్రీనివాసులు మరో స్నేహితుడిని అభినవరెడ్డికి పరిచయం చేశాడు. ఆ స్నేహితుడి ద్వారా రూ.53 లక్షలు దాకా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ తీసుకున్నాడు. ఈ మేరకు శ్రీనివాసులు నాయుడుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నవమి ఉత్సవాలకు వచ్చి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెళ్లకూరు, ఏప్రిల్ 20: శ్రీరామ నవమి ఉత్సవాలకు స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ ప్రాణాలు కోల్పోయింది, ఆమె భర్త గాయపడ్డాడు. నాయుడుపేట మండలం జువ్వలపాలేనికి చెందిన సుందరరామయ్య ఆమె భార్య మునికుమారి(49) శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నారు. సుందరమరాయ్య శ్రీకాళహస్తి ఆలయంలో కాంట్రాక్టర్ ఉద్యోగి, ఆయన భార్య ఆర్టీసీ కండక్టర్. భార్యాభర్తలు ఇటీవల స్వగ్రామంలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం శనివారం ఉదయం బైక్‌లో శ్రీకాళహస్తికి తిరిగి పయనమయ్యారు. ఈ క్రమంలో మండలంలోని చెంబేడు క్రాస్ రోడ్డుపై వారిని వెనుకవైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌నుంచి కింద పడిని మునికుమారి తలపై లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుందరరామయ్య గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తలరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో రామరాజ్యం

కోట, ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల అనంతరం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో రామరాజ్యం రానున్నదని టీడీపీ నాయకులు తెలిపారు. కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో శనివారం టీడీపీ నాయకులు పాశం సునీల్‌కుమార్, వరప్రసాదరావును గెలిపించాలంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, టీడీపీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, తీగల సురేష్‌బాబు, మధుయాదవ్, పోలమ్మ, అనిల్, రామమూర్తి, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయండి

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల కోడ్ సందర్భంగా ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రాష్ట్ర ఎన్నికల ఖర్చుల ప్రత్యేక అధికారి నీనా నిగం అన్నారు. శనివారం వల్లివేడు చెక్‌పాయింట్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తనిఖీ సమయంలో వాహనం రిజిస్టరు నెంబరు, ఎక్కడి నుంచి ఎక్కడి పోతుంది పూర్తి వివరాలు రికార్డు చేయాలన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు ఎస్ఎస్‌టీ టీం, ఎఫ్ఎస్‌టీ టీం, వీఎస్‌టీ, వీవీఎస్‌టీ టీం సీడీలు సేకరించారు. వాటిని తిరుపతి కలెక్టర్ పంపిస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 20: ప్రతి ఒక్కరికి భారతీయ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని వెంకటగిరి సివిల్ జడ్జి వి.అనూషా అన్నారు. శనివారం బొగ్గులమిట్టలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె దిశా చట్టం, 498 ఐసీపీ, ఉచితంగా లాయర్‌ను పెట్టడం తదితరాలపై అవగాహన కల్పించారు.అన్ని రంగాల్లో మహిళలు రాణించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లాయర్లు రాం ప్రసాద్, రాజేష్, అనుపమ, స్వప్న, ఏఎస్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జడ్జి అనూషా

ఐకమత్యమే గెలుపునకు తొలిమెట్టు: నెలవల

ఓజిలి, ఏప్రిల్ 20: టీడీపీ సహా అనుబంధ విభాగాల శ్రేణుల మధ్య ఐకమత్యమే పార్టీ గెలుపునకు తొలిమెటటని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం అన్నారు. ఓజిలిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి అధినేత చంద్రబాబుకు కానుకగా అందిద్దామన్నారు. ఎన్నికల ప్రచారం, సూపర్ సిక్స్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రణాళికలు రూపొందించారు. పార్టీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసులురెడ్డి, ఎ.ధనుంజయరెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, ఎస్.కె.ఖలీల్, కె.సత్యవరప్రసాద్‌రావు, తదితరులు ఉన్నారు.

నాయుడుపేట: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు హాయంలోనే జరిగిందని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకొని ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

రక్తదానం శిబిరం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదినం సందర్భంగా శనివారం పార్టీ కార్యాలయం వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. చిట్టేటి పెరుమాల్, తడ మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళి రెడ్డి, జి.రమేష్ రెడ్డి, వేనాటి మురళి రెడ్డి, మునిరాజా, బాలకృష్ణ, బుద్ధి విజయలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.